MAHANAGAR DINAPATRIKA

మహానగర్


విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 329 | పేజీలు : 8 | బుధవారం 18 నవంబర్ 2026 | వెల : 6-00



భారత్-ఆసియాన్ బంధం మరింత బలోపేతం

- ఇండో-పసిఫిక్ భద్రతకు క్వాడ్.. ఆసియాన్‌తో వ్యూహాత్మక బంధం
- శాంతి, స్థిరత్వం, అభివృద్ధే లక్ష్యంగా భారత్ అడుగులు
- మనీలాలో ప్రధాని మోదీ కీలక ప్రసంగం
- సముద్ర భద్రత నుంచి సెమీకండక్టర్ల వరకు సహకారం
- ఆసియాన్ దేశాలకు పలు ప్రతిపాదనలు

2



వాయు కాలుష్యంలో 40 శాతం బాధ్యత నాదే

- రవాణా రంగం నుంచి వెలువడుతున్న ఉద్గారాలపై కీలక వ్యాఖ్యలు..
- ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగానికి పిలుపు
- రవాణా రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులకు విధాన నిర్దేశకంగా తనకూ బాధ్యత ఉంది
- కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ

తక్షణ సాయం అందించండి



వరుస తుఫాన్లతో రూ.7 వేల కోట్లకు పైగా నష్టం

రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు నిధులు విడుదల చేయండి


వైజాగ్ ఎకనమిక్ రీజియన్ అభివృద్ధికి సహకరించండి

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి

న్యూఢిల్లీ, మహానగర్

వరుసగా సంభవించిన ఆర్నబ్, మురసు తుఫాన్లతో రాష్ట్రానికి ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.7 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని, తక్షణ ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఢిల్లీలో మంగళవారం ఆమెతో సమావేశమైన సీఎం రాష్ట్రంలో తుఫాన్ల వల్ల దెబ్బతిన్న పంటలు, విద్యుత్ వ్యవస్థ, తీర ప్రాంత మౌలిక వసతుల గురించి వివరించారు. చేతికందే దశలో ఉన్న పంటలు నీటిపాలయ్యాయని, రైతులను ఆదుకునేందుకు కేంద్రం తక్షణ సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందాలు రాష్ట్రంలో పర్యటించాయని, త్వరలో నివేదిక సమర్పిస్తాయని తెలిపారు. మరోవైపు ప్రాంతాల వారీగా చేపడుతున్న అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌లో రహదారులు, సాగునీటి వసతులు, డ్రిప్ ఇరిగేషన్ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ ఎకనమిక్ రీజియన్‌కు అదనపు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. విశాఖలో ఇటీవల నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో కుదిరిన నిర్ణయాలు, పెట్టుబడుల వివరాలను కూడా కేంద్ర మంత్రికి వివరించారు. వరుస తుఫాన్ల కారణంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని సీఎం వివరించారు. ముఖ్యంగా చేతికందే దశలో ఉన్న పంటలు భారీ వర్షాలు, వరదల కారణంగా నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం కలిగించాయని తెలిపారు. పంటలతో పాటు విద్యుత్ వ్యవస్థ, తీర ప్రాంతాల్లోని మౌలిక వసతులు కూడా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. నష్టాల్లో కూరుకుపోయిన రైతులు, బాధిత కుటుంబాలను ఆదుకోవడానికి కేంద్రం వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. తుఫాన్ల కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు... మిగతా 2లో

అక్వాన్ తుఫాన్‌పై అప్రమత్తం



- ప్రజలకు ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలు పంపాలి
- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి
- పునరుద్ధరణ, సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలి

అమరావతి, మహానగర్

అక్వాన్ తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం తుఫాన్ గమనంపై అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు.. మిగతా 2లో

ఏపీ తీరంపై అక్వాన్ పంజా

- అక్వాన్ అలర్ట్.. కోస్తాకు భారీ వర్ష గండం
- తీరంవైపు తుపాను.. 145 కి.మీ. వేగంతో గాలులు
- అక్వాన్ ప్రభావం.. అప్రమత్తమైన ఏపీ యంత్రాంగం
- నెల్లూరు-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం
- విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా శాఖ ముందస్తు చర్యలు



అమరావతి, మహానగర్

బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తుపాను ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల వైపు దూసుకొస్తోంది. దక్షిణ, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఈ తుపాను రానున్న గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. బుధవారం ఉదయానికి తీవ్ర తుపానుగా, గురువారం సాయంత్రానికి అతి తీవ్ర తుపానుగా మారవచ్చని హెచ్చరించింది. తుపాను ప్రభావంతో ఈ నెల 19, 20 తేదీల్లో కోస్తాంధ్రలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే ... మిగతా 2లో

స్వర్ణ గ్రామ, వార్డు కో-ఆర్డినేటర్లకు 23 శాతం జీతాల పెంపు

డీసీలకు రూ.44,280.. ఏడీసీ, టీసీలకు రూ.33,210

2020 నుంచి ఎదురుచూస్తున్న వేతన సవరణకు మోక్షం..

కాంట్రాక్టు ఉద్యోగులకు ఆర్థికంగా ఊరట

2లో



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై వైఎస్ జగన్ పోరుబాట



చంద్రబాబు, లోకేష్ చెబుతున్న లెక్కల్లో పొంతనేది?

విద్యాదీవెన, వసతి దీవెన కింద రూ.9,600 కోట్ల బకాయిలు ఉన్నాయన్న మాజీ సీఎం

తప్పుడు లెక్కలు, వక్రీకరణలు ఆపి వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్

అమరావతి, మహానగర్

ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాల అమలుపై కూటమి ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెల్లడిస్తున్న గణాంకాలకు, అసెంబ్లీకి సమర్పించిన వివరాలకు, కాగ్ నివేదికలోని లెక్కలకు మధ్య తీవ్ర వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. విద్యాదీవెన, వసతి దీవెన పథకాల కింద పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు చంద్రబాబు, లోకేష్ చెబుతున్న లెక్కలను ప్రస్తావిస్తూ వైఎస్ జగన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పలు ప్రశ్నలు సంధించారు. ఒకే విద్యా సంవత్సరానికి మూడు రకాల లెక్కలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాలల యాజమాన్యాలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం వెల్లడించిన గణాంకాలను జగన్ ప్రస్తావించారు. ఆ ఏడాదికి ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.1,451.38 కోట్లు చెల్లించినట్లు ప్రభుత్వం తాజాగా చెబుతోందని పేర్కొన్నారు. అయితే ఇదే అంశంపై గత ఆగస్టు 18న విద్యాశాఖ అసెంబ్లీకి సమర్పించిన రాతపూర్వక సమాధానంలో రూ.2,969.66 కోట్లు చెల్లించినట్లు పేర్కొందని గుర్తుచేశారు. మరోవైపు, కాగ్ నివేదికలో ఆ ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్ ఖర్చు రూ.1,771.32 కోట్లుగా నమోదైందని తెలిపారు. ఒకే ఏడాదికి ప్రభుత్వం ప్రజలకు ఒక లెక్క, అసెంబ్లీకి మరో లెక్క, కాగ్ నివేదికలో ఇంకో లెక్క కనిపిస్తోందని విమర్శించారు. ఈ మూడు గణాంకాల్లో ఏది వాస్తవమో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ... మిగతా 2లో



విద్వేషం నుంచి విముక్తి కల్పించి ప్రేమను పంచడమే నా విధి

- రాజీవ్, సోనియాల అనుబంధంపై వ్యాఖ్యలు.. రాహుల్ గాంధీ కౌంటర్
- సోనియా గాంధీ పుస్తకావిష్కరణలో తల్లిదండ్రుల అనుబంధాన్ని గుర్తుచేసుకున్న రాహుల్
- తల్లిదండ్రుల భోజన సమయాల గురించి మాట్లాడిన వ్యాఖ్యలపై విమర్శలు
- విమర్శలకు కౌంటర్‌గా ఎక్స్‌లో శివపార్వతుల శిల్పం ఫొటో పోస్ట్ చేసిన ప్రతిపక్ష నేత

5

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

ఓటర్లు భయం, ఒత్తిడి, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలి

డ్రోన్లతో నిఘా.. గ్రామాల్లో భద్రతా చర్యలు ముమ్మరం

జగ్గయ్యపేట, మహానగర్





పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడంతో పాటు ఓటర్లలో భద్రతా భావం కల్పించేందుకు ఎన్టీఆర్ జిల్లా పోలీసులు ముందస్తు చర్యలను ముమ్మరం చేశారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు ఆదేశాల మేరకు మంగళవారం జగ్గయ్యపేట సర్కిల్ పరిధిలోని వత్సవాయి పోలీస్ స్టేషన్ పరిధి తల్లూరు, కంబంపాడు గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. రూరల్ డీసీపీ బి. లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఏసీపీ చలసాని శ్రీనివాసరావు, జగ్గయ్యపేట ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, వత్సవాయి ఎస్ఐ ఉమామహేశ్వరరావు, అబ్రహం తదితర పోలీసు అధికారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేశారు. ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి లేదా ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని, ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణకు పోలీసులకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు రక్షణ కల్పించడం, ఓటర్లకు భద్రత కల్పించడం, ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే పోలీసు యంత్రాంగం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

స్వర్ణ గ్రామ, వార్డు కో-ఆర్డినేటర్లకు 23 శాతం జీతాల పెంపు

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు విభాగాల్లో పనిచేస్తున్న కో-ఆర్డినేటర్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ డిమాండ్‌పై సానుకూలంగా స్పందిస్తూ వారి జీతాలను 23 శాతం పెంచింది. ఈ మేరకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. తాజా నిర్ణయంతో జిల్లా, అసిస్టెంట్ జిల్లా, టౌన్ కో-ఆర్డినేటర్లకు నెలవారీ వేతనాలు పెరగనున్నాయి.

ఎవరికి ఎంత పెరిగిందంటే?

ప్రభుత్వ నిర్ణయం ప్రకారం వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న కో-ఆర్డినేటర్ల వేతనాలు ఇలా పెరగనున్నాయి.

ఉద్యోగ హోదా	పాత వేతనం	కొత్త వేతనం	పెరిగిన మొత్తం
జిల్లా కో-ఆర్డినేటర్ (ఐజ)	రూ.36,000	రూ.44,280	రూ.8,280
అసిస్టెంట్ జిల్లా కో-ఆర్డినేటర్ (ూఐజ)	రూ.27,000	రూ.33,210	రూ.6,210
టౌన్ కో-ఆర్డినేటర్ (ఏజ)	రూ.27,000	రూ.33,210	రూ.6,210

2020 నుంచి వేతన సవరణ కోసం ఎదురుచూపులు

స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు విభాగాల్లో పనిచేస్తున్న ఈ కో-ఆర్డినేటర్లు 2020లో కాంట్రాక్టు పద్ధతిలో విధుల్లో చేరారు. అప్పటి నుంచి తమ వేతనాలను సవరించాలని కోరుతున్నప్పటికీ ఇప్పటివరకు పెంపు జరగలేదు. పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా జీతాలు పెంచాలని ఉద్యోగులు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వారి సుదీర్ఘ నిరీక్షణకు తెరపడినట్లయింది.

ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర

గ్రామ, వార్డు స్థాయిలో ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా పర్యవేక్షించడం కో-ఆర్డినేటర్ల ప్రధాన బాధ్యతల్లో ఒకటి. ప్రజా సేవల అమలు తీరును పరిశీలించడం, సచివాలయాల పనితీరును సమన్వయం చేయడం, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం వంటి విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వానికి, క్షేత్రస్థాయి సిబ్బందికి మధ్య సమన్వయకర్తలుగా వ్యవహరిస్తున్నారు.

ఉద్యోగులకు ఆర్థికంగా ఊరట

చాలాకాలంగా వేతన పెంపు కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు తాజా నిర్ణయం ఆర్థికంగా కొంత వెసులుబాటు కల్పించనుంది. జిల్లా కో-ఆర్డినేటర్లకు నెలకు రూ.8,280, అసిస్టెంట్ జిల్లా, టౌన్ కో-ఆర్డినేటర్లకు రూ.6,210 చొప్పున అదనపు వేతనం లభించనుంది. ప్రభుత్వ ఉత్తర్వుల అమలుతో పెరిగిన వేతనాలు అందనున్నాయి

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై వైఎస్ జగన్ పోరుబాట

-మొదటిపేజీ తరువాయి

చెల్లింపులపైనా జగన్ ప్రశ్నలు లేవనెత్తారు. ఆ ఏడాదికి ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.1,665 కోట్లు చెల్లించినట్లు ప్రభుత్వం ప్రకటించిందని పేర్కొన్నారు. అయితే రాష్ట్ర బడ్జెట్‌లో సవరించిన అంచనాల ప్రకారం ఈ పథకానికి కేటాయించిన మొత్తం రూ.1,200 కోట్లేనని తెలిపారు. బడ్జెట్ సవరించిన అంచనాల కంటే అదనంగా రూ.465 కోట్లు ఎలా చెల్లించారని ప్రశ్నించారు. అదనపు నిధులు ఎక్కడి నుంచి సమకూర్చారో ప్రభుత్వం వివరించాలని కోరారు. విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు పూర్తి ఫీజులు అందలేదని చెబుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటిస్తున్న చెల్లింపుల వివరాలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

పూర్తికాని త్రైమాసికాలకు చెల్లింపులెలా?

2026-27 ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన గణాంకాలపైనా జగన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. డిసెంబర్ వరకు మూడు త్రైమాసికాలకు సంబంధించి రూ.1,845 కోట్లు చెల్లించినట్లు చెబుతున్నారని పేర్కొన్నారు. అయితే మూడో త్రైమాసికం కూడా పూర్తికాకముందే చెల్లింపులు పూర్తయినట్లు ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలోనే విద్యార్థుల సంఖ్యను ఎలా ఖరారు చేశారని, లబ్ధిదారులను నిర్ధారించకుండానే చెల్లింపులు ఎలా జరిపారని నిలదీశారు. ఈ గణాంకాలపై ప్రభుత్వం సమగ్ర వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల కోడ్‌తోనే చివరి త్రైమాసికం పెండింగ్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయంటూ కూటమి ప్రభుత్వం చేస్తున్న విమర్శలను జగన్ ఖండించారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి మూడు త్రైమాసికాల చెల్లింపులు తమ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని తెలిపారు. నాలుగో త్రైమాసికానికి సంబంధించిన జనవరి నుంచి మార్చి వరకు చెల్లింపులు జరగాల్సి ఉండగా, 2024 మార్చి 16న ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో ఆ విడత చెల్లింపులు నిలిచిపోయాయని వివరించారు. తమ ప్రభుత్వంలో ప్రతి త్రైమాసికానికి సంబంధించిన మొత్తాన్ని ఆ త్రైమాసికం ముగిసిన వెంటనే విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేసేవారమని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన ఒక్క విడతను చూపిస్తూ మొత్తం పథకం అమలుపై విమర్శలు చేయడం సరికాదన్నారు.

గతంలో రూ.2 వేల కోట్ల బకాయిలు చెల్లించాం

గతంలో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వదిలివెళ్లిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూడా జగన్ ప్రస్తావించారు. 2017-18, 2018-19 విద్యా సంవత్సరాలకు సంబంధించి సుమారు రూ.2 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని, వాటిని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల ప్రయోజనాల కోసం చెల్లించిందని తెలిపారు. ఈ విషయాన్ని చంద్రబాబు ప్రభుత్వమే అంగీకరించిందని పేర్కొన్నారు. 2026 ఫిబ్రవరి 11న శాసనమండలికి ఇచ్చిన రాతపూర్వక సమాధానంలో ఆ బకాయిల వివరాలు వెల్లడించారని గుర్తుచేశారు. గతంలో తాము చెల్లించిన బకాయిల గురించి ప్రస్తావించకుండా, తమ ప్రభుత్వ హయాంలోని పెండింగ్ అంశాలను మాత్రమే ప్రస్తావించడం ఏమిటని ప్రశ్నించారు.

ఏపీ తీరంపై అక్వాన్ పంజా..

-మొదటిపేజీ తరువాయి

అవకాశముందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం తుపాను చెన్నైకు సుమారు 590 కిలోమీటర్లు, మచిలీపట్నం, విశాఖపట్నాలకు దాదాపు 650 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లు సమాచారం. శుక్రవారం మధ్యాహ్నానికి నెల్లూరు--విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 130 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరికలు జారీ అయ్యాయి.

కోస్తాకు అత్యంత భారీ వర్ష సూచన

తుపాను ప్రభావంతో గురు, శుక్రవారాల్లో కోస్తా జిల్లాల్లో పలుచోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడవచ్చని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. బుధవారం సాయంత్రం నుంచి తీర ప్రాంతాల్లో గాలుల తీవ్రత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే పరిస్థితులు ఉండవచ్చని, గరిష్ఠంగా 145 కిలోమీటర్ల వేగాన్ని అందుకోవచ్చని హెచ్చరించింది. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు స్పష్టం చేశారు. ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు వెంటనే తీరానికి చేరుకోవాలని సూచించారు.

ప్రజలకు విపత్తుల నిర్వహణ సంస్థ సూచనలు

తుపాను నేపథ్యంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. విలువైన పత్రాలను వాటర్‌ప్రూఫ్ కవర్లలో భద్రపరచుకోవాలని, కనీసం వారం రోజులకు సరిపడా ఆహార పదార్థాలు, తాగునీటిని సిద్ధం చేసుకోవాలని తెలిపింది. తుపాను సమయంలో అవసరాన్ని బట్టి విద్యుత్ మెయిన్ స్విచ్‌ను ఆఫ్ చేయాలని, తలుపులు, కిటికీలను గట్టిగా మూసి ఉంచాలని సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనల మేరకు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని కోరింది. చెట్లు, హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాల కింద నిలబడవద్దని హెచ్చరించింది. సామాజిక మాధ్యమాల్లో వచ్చే నిర్ధారణలేని సమాచారాన్ని నమ్మవద్దని, అధికారిక ప్రకటనలను మాత్రమే అనుసరించాలని సూచించింది.

అత్యవసర సహాయం కోసం: మనమిత్ర -- 95523 00009, అత్యవసర నంబర్లు -- 112, 1070, 18004250101.

విద్యుత్ శాఖ అప్రమత్తం


అక్వాన్ తుపాను ముప్పును ఎదుర్కొనేందుకు రాష్ట్ర విద్యుత్ శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ నెల 19, 20 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్‌తో కలిసి పరిస్థితిని సమీక్షించి పలు ఆదేశాలు జారీ చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. గతంలో అర్నబ్, మురసు తుపాన్ల సమయంలో ఎదురైన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

మరమ్మతు బృందాలు సిద్ధంగా ఉండాలి

విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని గొట్టిపాటి రవికుమార్ అధికారులకు సూచించారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరా నిలిచిపోతే వెంటనే పునరుద్ధరించేలా సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అత్యవసర మరమ్మతుల కోసం వాహనాలు, పరికరాలను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. తుపాను తీవ్రతను బట్టి సహాయక చర్యలు చేపట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సిద్ధమవుతున్నారు.

అక్వాన్ తుఫాన్‌పై అప్రమత్తం

-మొదటిపేజీ తరువాయి



గంటకు మూడు కిలోమీటర్ల వేగంతో తుఫాన్ కదులుతోందని, సాయంత్రానికి దాని తీవ్రతపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఆర్టీజీఎస్ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సాయంత్రానికి తీవ్ర తుఫానుగా మారే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రస్తుతం చెన్నైకి 610 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 660 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 670 కిలోమీటర్లు, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 790 కిలోమీటర్ల దూరంలో తుఫాన్ కేంద్రీకృతమైందని వెల్లడించారు. ఈ నెల 19, 20 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తుఫాన్ తీరం దాటే సమయంలో ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని అంచనా వేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాష్ట్రాన్ని మూడో తుఫాన్ ప్రభావితం చేస్తోందని, విపత్తుల పట్ల భయపడకుండా వాటి ప్రభావం ప్రజలపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు, తుఫాన్ ప్రభావిత ప్రాంతాలకు ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలు పంపాలని, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బంది ద్వారా నేరుగా సమాచారం అందించాలని ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా అప్రమత్తం చేయాలని, ఎంతటి విపత్తు వచ్చినా ప్రభుత్వం, అధికారులు అండగా ఉంటారనే భరోసాను ప్రజల్లో కల్పించాలని చెప్పారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిన వెంటనే తొలగించి విద్యుత్, ఇతర సేవలను పునరుద్ధరించాలని, పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ సహాయక చర్యలు, రెస్క్యూ ఆపరేషన్లు, పునరావాస ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. తుఫాన్ కారణంగా చెరువులు, కాల్వలకు గండ్లు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

తక్షణ సాయం అందించండి



-మొదటిపేజీ తరువాయి

కేంద్ర బృందాలు ఇప్పటికే రాష్ట్రంలో పర్యటించాయని చంద్రబాబు తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలనలు పూర్తి చేసిన బృందాలు త్వరలో కేంద్రానికి నివేదిక సమర్పించనున్నట్లు వివరించారు. నివేదిక ఆధారంగా సాయం అందించడంలో జాప్యం చేయకుండా రాష్ట్రానికి అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని కేంద్ర మంత్రిని కోరారు.

రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు నిధులు

రాష్ట్రంలో ప్రాంతాలవారీగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కూడా చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యాన పంటల సాగుకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతిపాదించిన హార్టికల్చర్ హబ్ అభివృద్ధికి అవసరమైన నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రహదారుల నిర్మాణం, సాగునీటి వసతుల కల్పన, డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థల అభివృద్ధికి కేంద్ర సహకారం అవసరమని వివరించారు.

విశాఖ ఎకనమిక్ రీజియన్‌కు అదనపు నిధులు

వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నం ఆర్థిక ప్రాంతం (వైజాగ్ ఎకనమిక్ రీజియన్) అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని చంద్రబాబు కోరారు. ఈ ప్రాంతాన్ని పారిశ్రామిక, వాణిజ్య, పెట్టుబడుల కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలను వివరించారు. విశాఖలో ఇటీవల నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో కుదిరిన ఒప్పందాలు, ప్రతిపాదిత పెట్టుబడులు, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఉన్న అవకాశాలను నిర్మలా సీతారామన్‌కు వివరించారు.

సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు

కేంద్ర ఆర్థిక మంత్రితో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పలువురు ఎంపీలు, ఆర్థిక శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తుఫాన్ల నష్టాల నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించడంతో పాటు, దీర్ఘకాలిక అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్రం నుంచి ఆర్థిక సహకారం పొందడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఈ సమావేశంలో పలు అంశాలను ప్రస్తావించారు.

ఆక్వాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి - ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, మహానగర్

ఆక్వాన్ తుఫాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని కోరారు. డ్రైనేజీ శాఖ అధికారులు, నీటి సంఘాల ప్రతినిధులు సమిష్టిగా పనిచేసి మురుగునీటి పారుదలకు ఎక్కడైనా అడ్డంకులు ఏర్పడి ఉంటే వాటిని తొలగించాలని సూచించారు. ఎల్-నీనో పరిస్థితిలోనూ ప్రణాళికతో సాగు చేసిన పంటను కాపాడుకునేందుకు వర్షపునీరు ఎప్పటికప్పుడు మురుగుబోదులకు మళ్లించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. తుఫాన్ దిశ మార్చుకుంటే వీచే గాలులకు ప్రమాదాలకు గురికాకుండా ప్రజలు తుఫాను తీరం దాటే సమయంలో బయటకు రావద్దని సూచించారు. అధిక వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అధికారులు తగిన సన్నాహాలు చేయాలన్నారు. ప్రధానంగా మత్స్యకారులు, రైతులు, బలహీన గృహాల ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని సూచించారు.

మరుపిళ్ల తిరుమలేష్ కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుంది

ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

విజయవాడ, మహానగర్



తెలుగుదేశం పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన నాయకులు, కార్యకర్తలను ఎప్పటికీ మరచిపోమని, మరుపిళ్ల తిరుమలేష్ కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. నగరాల కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేసిన మరుపిళ్ల తిరుమలేష్ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొని, తిరుమలేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తిరుమలేష్ తక్కువ సమయంలోనే తనకు అత్యంత ఆప్తుడిగా మారారని, టీడీపీ సిద్ధాంతాల పట్ల అంకితభావంతో పనిచేసి పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేశారని కొనియాడారు. నగరాల సామాజికవర్గానికి ప్రత్యేక గుర్తింపు, ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సహకారంతో నగరాల కార్పొరేషన్‌ను విజయవాడకు తీసుకురావడంలో ప్రత్యేక చొరవ తీసుకున్నామని తెలిపారు. సామాజికవర్గాల అభ్యున్నతికి, సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నగరాల సామాజికవర్గానికి చెందిన సుమారు 85 శాతం మంది కూటమికి మద్దతుగా నిలిచారని పేర్కొంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. తిరుమలేష్ కుటుంబానికి, ముఖ్యంగా కేదారేశ్వరికి తగిన గుర్తింపు, న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పంచాయతీ ఎన్నికలు పూర్తయిన తర్వాత ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, ఆమెకు తగిన గుర్తింపుతో పాటు చైర్మన్ పదవి దక్కేలా తన వంతు ప్రయత్నం చేస్తానని వెల్లడించారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలవడం టీడీపీ బాధ్యతగా భావిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ బుద్ధా వెంకన్న, నూర్‌బాషా కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, నాగవంశం కార్పొరేషన్ చైర్మన్ ఎర్రబోతు రమణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, కార్పొరేటర్లు ఆషా, చంటి, పిల్లా శ్రీను, ఎల్లాజీ, పోతిన ప్రసాద్, సోహిల్, మాదిగని గురునాథం, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఈలో సరికొత్త రికార్డు!

విజయవాడ, మహానగర్

ధనత్రయోదశి సందర్భంగా జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈ) బంగారం ఎలక్ట్రానిక్ రసీదుల విభాగంలో సరికొత్త రికార్డు నమోదు చేసింది. ఈ విభాగంలో ఏకంగా 2,27,692 యూనిట్ల లావాదేవీలు జరగడం విశేషం. పండుగ సీజన్‌లో ఎలక్ట్రానిక్ రూపంలో బంగారం కొనుగోలుపై పెరిగిన ఆసక్తి, డిమాండ్‌కు అనుగుణంగా బంగారం విక్రేతలు చురుగ్గా కార్యకలాపాలు నిర్వహించడంతో ఈ రికార్డు సాధ్యమైంది. ఎన్ఎస్ఈ అందిస్తున్న బంగారం ఎలక్ట్రానిక్ రసీదుల ద్వారా పెట్టుబడిదారులు భౌతికంగా బంగారాన్ని తమ వద్ద ఉంచుకోకుండానే డీమ్యాట్ ఖాతాలో బంగారాన్ని కలిగి ఉండటంతో పాటు, స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కొనుగోలు, విక్రయాలు జరిపే అవకాశం పొందుతున్నారు. భౌతిక బంగారంతో సమానమైన అంతర్గత విలువ కలిగిన ఈ విధానం ద్వారా పారదర్శకత, భద్రత, సమర్థవంతమైన లావాదేవీల ప్రయోజనాలు లభిస్తాయని ఎన్ఎస్ఈ వెల్లడించింది. పునర్వినియోగ బంగారంతో సహా దేశీయంగా లభించే బంగారాన్ని అధికారిక ఆర్థిక వ్యవస్థలోకి తీసుకురావడానికి ఈ విధానం దోహదపడుతుందని పేర్కొంది. నియంత్రణ సంస్థల పర్యవేక్షణ, ప్రామాణిక చెల్లింపులు, పరిష్కార విధానాల ద్వారా పెట్టుబడిదారులకు మరింత విశ్వసనీయమైన మార్కెట్ వ్యవస్థ అందుబాటులో ఉంటుందని తెలిపింది. ఈ సందర్భంగా ఎన్ఎస్ఈ ముఖ్య వ్యాపార అభివృద్ధి అధికారి శ్రీరామ్ కృష్ణన్ మాట్లాడుతూ ధనత్రయోదశి సంపద, శ్రేయస్సుకు ప్రతీకగా నిలిచే పండుగని, ఈ సందర్భంగా బంగారం కొనుగోలు చేయడం సంప్రదాయంగా వస్తోందని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా బంగారం సొంతం చేసుకునే విధానాలు కూడా మారుతున్నాయని, భౌతికంగా బంగారాన్ని కలిగి ఉండాల్సిన అవసరం లేకుండానే దాని విలువను పారదర్శకంగా, సురక్షితంగా పొందేందుకు ఎలక్ట్రానిక్ బంగారం రసీదులు అవకాశం కల్పిస్తున్నాయని చెప్పారు. దేశీయంగా లభించే, పునర్వినియోగ బంగారాన్ని ఈ రసీదులుగా మార్చడాన్ని ప్రోత్సహించడం ద్వారా దేశీయ బంగారు వనరులను సమర్థంగా వినియోగించుకోవడంతో పాటు, వ్యవస్థీకృత బంగారు మార్కెట్‌ను బలోపేతం చేయడానికి, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి దోహదపడుతుందని వివరించారు.

రిటైర్మెంట్‌తో పాటు వారసత్వ సంపద సృష్టికి ఐసీఐసీఐ లైఫ్ సిగ్నేచర్ పెన్షన్

విజయవాడ, మహానగర్

పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు తదుపరి తరానికి సంపదను వారసత్వంగా అందించేందుకు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ 'ఐసీఐసీఐ లైఫ్ సిగ్నేచర్ పెన్షన్' పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. మార్కెట్ ఆధారిత రాబడులతో రిటైర్మెంట్ నిధిని సమకూర్చుకునేలా రూపొందించిన ఈ పథకంలో 90 ఏళ్ల వరకు వెస్టింగ్ వయస్సు అవకాశం ఉంది. 40 ఏళ్ల వయస్సు నుంచే రిటైర్మెంట్ ప్రణాళిక ప్రారంభించవచ్చు. పాలసీ మెచ్యూరిటీ సమయంలో పోగైన నిధిలో 60 శాతం వరకు పన్ను నిబంధనలకు లోబడి ఏకమొత్తంగా పొందవచ్చు. మిగిలిన మొత్తంతో యాన్యుటీ కొనుగోలు చేసి పదవీ విరమణ అనంతరం ఆదాయం పొందవచ్చు. ఈ పథకంలో వివిధ ఫండ్ ఎంపికలు, 100 శాతం వరకు ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడి పెట్టే అవకాశం, ప్రీమియం చెల్లింపులో వెసులుబాటు ఉన్నాయి. ఐదేళ్ల లాక్-ఇన్ పూర్తయిన తర్వాత నిబంధనలకు లోబడి ఫండ్ విలువలో 25 శాతం వరకు పాక్షికంగా ఉపసంహరించుకోవచ్చు. చెల్లించిన ప్రీమియంలు లేదా ఫండ్ విలువలో అధికమైన మొత్తానికి 105 శాతం డెత్ బెనిఫిట్ కూడా అందిస్తుంది. ఫ్యామిలీ సెక్యూర్ ఆప్షన్ ద్వారా జాయింట్ లైఫ్ కవరేజీ సదుపాయం కల్పించారు.

దక్షిణాది డెయిరీ రంగంలో ప్రొటీన్ ఆధారిత ఉత్పత్తులకు పెరుగుతున్న ఆదరణ

విజయవాడ, మహానగర్

దక్షిణాది డెయిరీ రంగంలో తదుపరి వృద్ధికి ప్రొటీన్ ఆధారిత ఉత్పత్తులు కీలకంగా మారనున్నాయి. పాలు, పెరుగు, పన్నీర్ వంటి ఉత్పత్తుల వినియోగంతో పాటు వాటి ద్వారా లభించే పోషకాలపై వినియోగదారుల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని గోద్రెజ్ జెర్సీ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో ప్రతి నలుగురిలో ముగ్గురు పెద్దలు రోజూ పాలు లేదా పెరుగు తీసుకుంటుండగా, జాతీయ స్థాయిలో ఈ సంఖ్య సగానికంటే తక్కువగా ఉంది. దేశంలో ప్యాక్ చేసిన పెరుగు వార్షిక తలసరి వినియోగం 2.8 కిలోలతో పోలిస్తే దక్షిణాదిలో 4.2 కిలోలుగా ఉంది. అయితే పట్టణ భారతీయుల్లో ప్రొటీన్ అధికంగా ఉండే ఆహారం తీసుకునే వారి సంఖ్య తక్కువగా ఉందని వెల్లడించింది. ఆరోగ్యకరమైన పెద్దలు శరీర బరువులో ప్రతి కిలోకు 0.66 నుంచి 0.83 గ్రాముల ప్రొటీన్ తీసుకోవాలని ఐసీఎంఆర్ సూచిస్తోంది. రోజువారీ ఆహారంలో పెరుగు, పన్నీర్‌లోని ప్రొటీన్ ప్రయోజనాలను గుర్తించేలా వినియోగదారుల్లో అవగాహన కల్పించడమే తమ లక్ష్యమని గోద్రెజ్ జెర్సీ సీఈఓ గౌరవ్ పాండే తెలిపారు.

బీసీ అభ్యర్థులకు డీఎస్సీ ఆన్‌లైన్ శిక్షణకు సంస్థల ఎంపికకు టెండర్లు

విజయవాడ, మహానగర్

రాష్ట్రంలోని బీసీ అభ్యర్థులకు ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ)లో మెరుగైన శిక్షణ అందించేందుకు ఆన్‌లైన్ శిక్షణ సంస్థల ఎంపికకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ ఎ. మల్లికార్జున తెలిపారు. అర్హత కలిగిన ఆసక్తి గల సంస్థలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఈ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ ద్వారా టెండర్ ప్రక్రియలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 17వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 24వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు టెండర్ పత్రాలను పొందవచ్చని వెల్లడించారు. టెండర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, నిబంధనలు, ఇతర సమాచారం కోసం ఆసక్తి గల సంస్థలు విజయవాడలోని తాడిగడప పద్మజా నగర్‌లో ఉన్న విశాల్ రెసిడెన్సీ రెండో, మూడో అంతస్తుల్లోని బీసీ సంక్షేమ శాఖ సంచాలకుల కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. అర్హత కలిగిన ఆన్‌లైన్ శిక్షణ సంస్థలు నిర్ణీత గడువులోగా టెండర్ ప్రక్రియలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మల్లికార్జున కోరారు.

పీఆర్సీ నివేదికను త్వరితగతిన సమగ్రంగా రూపొందించాలి

12వ పీఆర్సీ చైర్మన్ దినేష్ కుమార్‌కు ఏపీ జేఏసీ చైర్మన్ విద్యాసాగర్, జేఏసీ నాయకుల విజ్ఞప్తి

విజయవాడ, మహానగర్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఆకాంక్షలకు అనుగుణంగా 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) నివేదికను వీలైనంత త్వరగా సమగ్రంగా రూపొందించాలని ఏపీ జేఏసీ చైర్మన్, ఏపీ ఎన్జీజీఓస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ కోరారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ప్రభుత్వ శాఖల వద్ద అందుబాటులో ఉన్న డేటాబేస్‌ను సమర్థంగా వినియోగించుకుని నివేదిక తయారీ ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. 12వ పీఆర్సీ చైర్మన్‌గా నియమితులైన దినేష్ కుమార్‌ను ఏపీ జేఏసీ, ఏపీ ఎన్జీజీఓస్ అసోసియేషన్ నాయకులు మంగళవారం వెలగపూడి సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల తరపున పలు కీలక అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు పీఆర్సీ నివేదిక కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నందున కమిటీ అధ్యయనాన్ని వేగవంతం చేసి నివేదికను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. గత పీఆర్సీ సమయంలో ఉద్యోగుల భత్యాలు, ఇతర సర్వీసు అంశాలకు సంబంధించిన ఉత్తర్వుల జారీలో అనేక సమస్యలు, జాప్యాలు ఎదురయ్యాయని ప్రస్తావిస్తూ, ఈసారి అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి న్యాయమైన సిఫార్సులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల వేతనాలు, సర్వీసు వివరాలు, భత్యాలు,



ఇతర ఆర్థిక అంశాలకు సంబంధించిన సమాచారం ప్రస్తుతం ప్రభుత్వ శాఖల వద్ద డిజిటల్ రూపంలో అందుబాటులో ఉందని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా సమాచార సేకరణ, విశ్లేషణను వేగవంతం చేసి వాస్తవ సమాచార ఆధారంగా నివేదిక రూపొందించవచ్చని వివరించారు. గత మూడేళ్లుగా ఉద్యోగులు ఎదుర్కొన్న కాలపరమైన, ఆర్థిక నష్టాలను కూడా పరిగణనలోకి తీసుకుని సిఫార్సులు చేయాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా, న్యాయబద్ధమైన సిఫార్సులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల, ప్రధాన కార్యదర్శి బసవలింగం, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జానీ పాషా, కార్యదర్శి అంకమ్మరాజు, ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు జి. నారాయణరావు, విష్ణువర్ధన్ రావు, ట్రెజరీ అసోసియేషన్ అధ్యక్షుడు పాము శ్రీనివాసరావు, కార్యదర్శి రమణరెడ్డి, అనిమల్ హస్బెండరీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ సేవా నాయక్, కార్యదర్శి రామకృష్ణ, ఇరిగేషన్ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సి.హెచ్. కృష్ణారెడ్డి, రాష్ట్ర సహాధ్యక్షుడు పి. రమేష్, టెక్నికల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమయాజులు, సీపీఎస్ ఎంప్లాయీస్ రాష్ట్ర అధ్యక్షుడు సి. మరియదాసుతో పాటు ఏపీ ఎన్జీజీఓస్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా, నగర నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు. పీఆర్సీ కమిటీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకుని నిర్ణీత గడువులో సమగ్ర నివేదిక రూపొందిస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ఏపీ ఎన్జీవో సంఘం ప్రధాన అజెండా

పెండింగ్ బకాయిల చెల్లింపు, డీఏల మంజూరు, హెల్త్ కార్డుల అమలుకు నిరంతర కృషి

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఉద్యోగుల సహకారం మరువలేనిది: రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్

విజయవాడ, మహానగర్

ఉద్యోగుల హక్కులు, ఆర్థిక ప్రయోజనాలు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడటమే ఏపీ ఎన్జీవో సంఘం ప్రధాన అజెండా అని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీజేఏసీ చైర్మన్ ఎ. విద్యాసాగర్ తెలిపారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ముంచిరాజు అక్కిరాజుతో పాటు నూతన కార్యవర్గానికి విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ అభినందనలు తెలిపారు. సమావేశంలో విద్యాసాగర్ మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిల చెల్లింపు, కరువు భత్యం (డీఏ) మంజూరు, అందరికీ ఆరోగ్య భద్రత కల్పించే హెల్త్ కార్డుల సమర్థవంతమైన అమలు కోసం ఏపీ ఎన్జీవో సంఘం ప్రభుత్వంతో నిరంతరం చర్చలు జరుపుతూ ఉద్యోగుల తరపున తన వాణిని వినిపిస్తోందన్నారు. ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను సాధించడం, వారి సమస్యలను పరిష్కరించడం సంఘం ప్రధాన బాధ్యతగా భావిస్తోందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఉద్యోగులకు ఏపీ ఎన్జీవో సంఘం, జేఏసీలో ప్రత్యేక స్థానం ఉందని, గత 30 ఏళ్లుగా విశ్వవిద్యాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తోందని తెలిపారు. సంఘం ఉద్యమాలు, కార్యక్రమాలకు రాష్ట్రవ్యాప్తంగా



ఉద్యోగులు అందిస్తున్న మద్దతు విలువైనదని, ముఖ్యంగా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఉద్యోగులు మొదటి నుంచి అందిస్తున్న సహకారం, ఐక్యత మరువలేనివని అభినందించారు. ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచడం, 11 వేల మంది సీపీఎస్ ఉద్యోగులను ఓపీఎస్ పరిధిలోకి తీసుకురావాలనే డిమాండ్ల సాధనకు ఏపీజేఏసీ చైర్మన్‌గా విద్యాసాగర్ చేస్తున్న కృషిని నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ప్రశంసించారు. ఉద్యోగుల సంక్షేమం కోసం చేపట్టే కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. డి.వి. రమణ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ ఎన్జీవో సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని, ఉద్యోగుల ఐక్యతతో భవిష్యత్తులోనూ మరిన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్జీఈఎఫ్ ఉమెన్ సబ్ కమిటీ సభ్యురాలు రాజ్యలక్ష్మి, రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సి.ఎం. దాస్, ఎన్టీఆర్ జిల్లా ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు డి. సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి రమేష్, సిటీ అధ్యక్షుడు సి.వి.ఆర్. ప్రసాద్, జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు జి. నారాయణరావు, పబ్లిక్ సెక్టార్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

డయల్ 112కు వచ్చిన కాల్‌తో తల్లీబిడ్డలకు ప్రాణరక్షణ

ప్రకాశం బ్యారేజీ వద్ద ఆత్మహత్యాయత్నం

సీసీ కెమెరాల ద్వారా గుర్తించి తక్షణమే స్పందించిన పోలీసులు

సిబ్బందిని అభినందించిన పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు

విజయవాడ, మహానగర్

డయల్ 112కు వచ్చిన సమాచారంతో అప్రమత్తమైన జిల్లా పోలీసులు ప్రకాశం బ్యారేజీ వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళతో పాటు ఆమె రెండేళ్ల కుమార్తెను సురక్షితంగా రక్షించారు. గుంటూరుకు చెందిన మహిళ కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురై చిన్నారితో కలిసి నదిలో దూకేందుకు వెళ్లినట్లు మంగళవారం ఉదయం పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందింది. కంట్రోల్ రూమ్ హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు నుంచి సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ ఎం.వి. దుర్గారావు వెంటనే అప్రమత్తమై కమాండ్ కంట్రోల్‌లోని సీసీ కెమెరాల ద్వారా మహిళ ప్రకాశం బ్యారేజీ సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ గుణారామ్‌కు సమాచారం అందించారు. దీంతో పోలీస్ కానిస్టేబుల్ గురువులు, హోంగార్డు అబ్దుల్ జలీల్ ఘటనా స్థలానికి చేరుకుని మహిళను, చిన్నారిని గుర్తించి సురక్షితంగా రక్షించారు. అనంతరం మహిళకు, ఆమె కుటుంబ సభ్యులకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి, క్షణికావేశంలో ప్రాణాలు తీసుకోవడం సమస్యలకు పరిష్కారం కాదని, ఇబ్బందులు ఎదురైనప్పుడు పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. అనంతరం ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనలో తక్షణమే స్పందించి



తల్లీబిడ్డలను రక్షించడంలో కీలకంగా వ్యవహరించిన కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ ఎం.వి. దుర్గారావు, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ గుణారామ్‌తో పాటు సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల శ్రేయస్సు, భద్రతే ఎన్టీఆర్ జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

డీ లిమిటేషన్ బిల్లు.. కాంగ్రెస్ ఒంటరి

దేశవ్యాప్తంగా పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై జాతీయ రాజకీయాల్లో అనూహ్యమైన ఏకాభిప్రాయం దిశగా అడుగులు పడుతున్నాయి. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై జాతీయ రాజకీయాల్లో అనూహ్యమైన ఏకాభిప్రాయం దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. గత ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లును మూకుమ్మడిగా వ్యతిరేకించి అడ్డుకున్న ప్రతిపక్ష ఇండియా కూటమిలోని కీలక భాగస్వామ్య పక్షాలు, ఇప్పుడు తమ వైఖరిని మార్చుకుని సానుకూల సంకేతాలు ఇస్తున్నాయి. ముఖ్యంగా జనాభా ప్రాతిపదికన కాకుండా, అన్ని రాష్ట్రాల్లోనూ సమానంగా 50 శాతం ఫ్లాట్ పెంపు ప్రతిపాదనకు ఎన్సీపీ శరద్ పవార్ వర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే బహిరంగంగానే మద్దతు ప్రకటించడం జాతీయ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటివరకు ఈ ప్రక్రియపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ప్రతిపక్ష ఇండియా కూటమిలోని కీలక భాగస్వామ్య పక్షాలు సైతం ఇప్పుడు తమ వైఖరిని మార్చుకుని సానుకూల సంకేతాలు ఇస్తున్నాయి., ముఖ్యంగా ఎన్సీపీ శరద్ పవార్ వర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే బహిరంగంగానే 50 శాతం ఫ్లాట్ పెంపు ప్రతిపాదనకు మద్దతు ప్రకటించడం, ఇతర ప్రాంతీయ పార్టీలు పరోక్షంగా సమ్మతి తెలపడం హాట్ టాపిక్‌గా మారింది. ఈ కీలక రాజ్యాంగ సవరణ బిల్లు విషయంలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ దాదాపు ఒంటరిగా మిగిలిపోయే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.గతంలో జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయంటూ డీఎంకే, బీఆర్ఎస్ వంటి పార్టీలు గట్టిగా వ్యతిరేకించాయి. అయితే, కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నట్లుగా భావిస్తున్న ప్రో-రేటా .. అన్ని రాష్ట్రాలకు సమాన నిష్పత్తిలో 50 శాతం సీట్లు పెంచే ఫార్ములాపై ఈ పార్టీలలో సానుకూలత వ్యక్తమవుతోంది. ప్రస్తుతం 543గా ఉన్న లోక్‌సభ స్థానాలను 50 శాతం పెంచితే ఆ సంఖ్య సుమారు 814 లేదా 815కి చేరుతుంది. ఈ లెక్కన తమిళనాడు సీట్లు 39 నుంచి 58?59కి, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల సీట్లు 42 నుంచి 63కి ..తెలంగాణ 25?26, ఏపీ 37?38 , మహారాష్ట్ర సీట్లు 48 నుంచి 72కి, ఉత్తరప్రదేశ్ సీట్లు 80 నుంచి 120కి పెరుగుతాయి. ఏ రాష్ట్రానికీ ప్రస్తుతమున్న తినిధ్య వాటా తగ్గకపోవడంతో ప్రాంతీయ పార్టీలకు ఎలాంటి అభ్యంతరం లేకుండా పోయింది.సమాజ్‌వాదీ పార్టీ , డీఎంకే, ఎన్సీపీ, బీఆర్ఎస్ వంటి ప్రాంతీయ పార్టీలకు సీట్ల పెంపు అనేది సంస్థాగతంగా పెద్ద ప్లస్ పాయింట్‌గా మారనుంది. ఒక నియోజకవర్గంలో ప్రస్తుతం 20 నుంచి 25 లక్షల మంది ఓటర్లు ఉండటంతో ప్రజాప్రతినిధులపై పనిభారం పెరిగిందని, 50 శాతం సీట్లు పెరిగితే తమ పార్టీలోని ద్వితీయ శ్రేణి నేతలకు ఎక్కువ టికెట్లు ఇచ్చే అవకాశం దక్కుతుందని ప్రాంతీయ పార్టీల అధినేతలు భావిస్తున్నారు. అందుకే, సుప్రియా సూలే స్వయంగా తమ బారామతి నియోజకవర్గ ఓటర్ల సంఖ్య 22 లక్షలకు చేరిన గణాంకాలను ఉదహరిస్తూ డీలిమిటేషన్ అవసరాన్ని సమర్థించారు.ఇదే తరహాలో ఉత్తరప్రదేశ్‌లో అఖిలేష్ యాదవ్, తమిళనాడులో స్టాలిన్ వర్గాలు సైతం తమ రాష్ట్రాల వాటా తగ్గనంత వరకు ఈ బిల్లును అడ్డుకోవాల్సిన అవసరం లేదనే అభిప్రాయానికి వచ్చినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.మరోవైపు, కాంగ్రెస్ పార్టీ మాత్రం లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచకుండా, ప్రస్తుతం ఉన్న 543 సీట్ల పరిధిలోనే పునర్విభజన జరగాలని పట్టుబడుతోంది. కాంగ్రెస్ ఈ ప్రతిపాదనను వ్యతిరేకించడం వెనుక ప్రజా ప్రయోజనాల కంటే ఆ పార్టీ అంతర్గత రాజకీయ లెక్కలే ఎక్కువగా ఉన్నాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో సంస్థాగతంగా బలహీనంగా ఉన్న కాంగ్రెస్‌కు, సీట్ల సంఖ్య 815కు పెరిగితే ఆ స్థాయిలో అభ్యర్థులను నిలబెట్టడం, ఎన్నికల వ్యయాన్ని భరించడం పెను సవాలుగా మారుతుంది. పైగా, దక్షిణాదిలో ఉన్న కొద్దిపాటి పట్టు కూడా జాతీయ స్థాయిలో పెరిగే సీట్ల ముందు చిన్నదిగా కనిపిస్తుందనే ఆందోళన ఆ పార్టీలో ఉంది. అయితే, కాంగ్రెస్ సొంత రాజకీయ ఇబ్బందుల కోసం మిత్రపక్షాలు తమ రాష్ట్రాలకు వచ్చే అదనపు సీట్ల అవకాశాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేవు.పార్లమెంటరీ గణాంకాల పరంగా చూస్తే, రాజ్యాంగ సవరణ బిల్లు ఆర్టికల్ 368 ప్రకారం ఆమోదం పొందాలంటే లోక్‌సభలో హాజరై ఓటు వేసే వారిలో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. ప్రస్తుతం ఎన్డీఏ కూటమికి లోక్‌సభలో 293 మంది సభ్యుల బలం ఉండగా, రాజ్యసభలోనూ మెజారిటీ ఉంది. దీనికి తోడు ఎన్సీపీ 8 మంది ఎంపీలు ,డీఎంకే 22 , సమాజ్‌వాదీ పార్టీ 37 , తృణమూల్ కాంగ్రెస్ 29 , వైసీపీ 4 వంటి పార్టీలు బిల్లుకు అనుకూలంగా ఓటు వేసినా లేదా ఓటింగ్‌కు గైర్హాజరైనా సభలో ఉన్న సభ్యుల సంఖ్య తగ్గి ఎన్డీఏకు మూడింట రెండొంతుల మెజారిటీ అత్యంత సులువుగా లభిస్తుంది. యితే, సీట్ల పెంపు వల్ల తమ రాష్ట్రాలకు అదనపు ప్రాతినిధ్యం, నేతలకు కొత్త రాజకీయ అవకాశాలు లభిస్తాయని భావిస్తున్న ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్ అభ్యంతరాలను పట్టించుకునే స్థితిలో లేవు. ఒక కీలక రాజ్యాంగ సవరణ బిల్లు విషయంలో విపక్ష కూటమిలో ఏర్పడిన ఈ చీలిక బీజేపీకి బలమైన రాజకీయ అస్త్రంగా మారింది. మిత్రపక్షాలైన ప్రాంతీయ పార్టీలే కేంద్ర ప్రతిపాదనకు తలూపుతుండటంతో, కాంగ్రెస్ పార్టీ తన వ్యతిరేకతను కొనసాగిస్తే మహిళా రిజర్వేషన్లకు, ప్రజాస్వామ్య విస్తరణకు కాంగ్రెస్ అడ్డుపడుతోంది అనే ముద్ర పడే ప్రమాదం ఉంది. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో కాంగ్రెస్ తన పట్టును వీడి ఏకాభిప్రాయానికి వస్తుందా, లేక ఒంటరి పోరాటానికే సిద్ధమవుతుందా అనేది ఇప్పుడు అత్యంత ఆసక్తికరంగా మారింది.అంతేకాకుండా, మహిళా రిజర్వేషన్ బిల్లు నారీ శక్తి వందన్ అధినియం అమలు కూడా డీలిమిటేషన్‌తో ముడిపడి ఉన్నందున, ఈ బిల్లును వ్యతిరేకిస్తే మహిళా వ్యతిరేక ముద్ర పడుతుందనే భయంతో చాలా పార్టీలు మద్దతు పలకక తప్పని పరిస్థితి నెలకొంది. వెరసి, కాంగ్రెస్ ఎంతగా వ్యతిరేకించినా, ప్రాంతీయ పార్టీల సహకారంతో కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ రాజ్యాంగ సవరణను పార్లమెంట్‌లో సునాయాసంగా పూర్తి చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

నాయకత్వ సంక్షోభంలో టాటా గ్రూప్



ముంబై : టాటా గ్రూప్‌లో గత కొంత కాలంగా వివాదాలకు కేంద్రంగా నిలుస్తున్న సంగతి తెలిసిందే. ఇక్కడ ఇప్పటికే ఒకవైపు టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్, అందులో మెజార్టీ వాటా ఉన్న టాటా ట్రస్ట్స్ మధ్య ఆధిపత్య పోరు కనిపిస్తోంది. ఈ క్రమంలోనే నాయకత్వ సంక్షోభం నెలకొంది. ఈ గొడవల మధ్య టాటా సన్స్ లిస్టింగ్ ఇష్యూ ఉంది. టాటా సన్స్‌ను నిబంధనల ప్రకారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్ చేయాలని ఆర్బీఐ ఎప్పటినుంచో చెబుతున్నా దానిని పక్కనబెట్టి అనవసర వివాదాల్లో చిక్కుకుంటోంది. ఈ నేపథ్యంలోనే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోసారి లిస్టింగ్ విషయమై టాటా సన్స్‌ను హెచ్చరించింది. ఈ మేరకు టాటా సన్స్ సీఎఫ్ఓ (చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్) లేఖ రాసింది. ఇక్కడ అప్పర్ లేయర్ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీస్ (ఔఈఅ- జఒ) మార్గదర్శకాల్ని కచ్చితంగా పాటించాల్సిందేనని, లిస్టింగ్ కూడా ఇందులోకే వస్తుందని స్పష్టం చేసింది.ఇక్కడ నిబంధనలు, నియంత్రణా మార్గదర్శకాలకు సంబంధించి టాటా సన్స్ అక్టోబర్ 6న ఆర్బీఐని స్పందన కోరింది. ఈ నేపథ్యంలో తాజాగా నవంబర్ 16న ఆర్బీఐ నుంచి రెస్పాన్స్ అందుకుంది. ఔఈఅ- జఒ కింద వర్తించే నిబంధనలు, మార్గదర్శకాలు అన్నీ పాటించాలని ఆర్బీఐ సూచించింది. దీని ప్రకారం టాటా సన్స్ కచ్చితంగా స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్ కావాల్సిందేనని తేల్చిచెప్పింది. నవంబర్ 26న టాటా సన్స్ బోర్డు కీలక సమావేశం నిర్వహిస్తున్న తరుణంలో దానికి 10 రోజుల ముందుగా ఆర్బీఐ నుంచి లేఖ రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.వాస్తవానికి టాటా సన్స్ లిస్టింగ్‌కు సంబంధించి ఆర్బీఐ 2022, సెప్టెంబర్ 30న తొలిసారి ఆదేశాలు జారీ చేసింది. అప్పర్ లేయర్ జాబితాలో చేరిన కారణంగా లిస్టింగ్ కావాలని టాటా సన్స్ సహా మరికొన్ని కంపెనీలను ఆదేశించింది. అప్పుడు సుమారు 16 కంపెనీలను ఆర్బీఐ ఈ జాబితాలో చేర్చగా 14 కంపెనీలు విలీనం లేదా ఐపీఓల ద్వారా మార్కెట్లో లిస్ట్ అవ్వగా, సంఘ్వీ ఫైనాన్స్ పబ్లిక్ ఫండ్స్ తీసుకోకపోవడం వల్ల ఈ జాబితా నుంచి బయటికి వచ్చింది. ఇక ప్రస్తుతానికి టాటా సన్స్ ఒక్కటే మిగిలి ఉంది.ఆర్బీఐ ఈ జాబితాలో చేర్చినప్పటి నుంచి మూడేళ్లలోగా ఏ కంపెనీ అయినా లిస్టింగ్ కావాలి. దీనికి గడువు 2025 సెప్టెంబర్ 30 గానే ఉంది. కానీ ఇప్పటికే నాలుగేళ్లు దాటిపోయింది. ఈ క్రమంలోనే లిస్టింగ్ నుంచి తప్పించుకోవడానికి టాటా సన్స్ ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తోంది. తమ కోర్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ లైసెన్స్ కూడా తిరిగిస్తామని దరఖాస్తు చేసుకుంది. దీనిని ఆర్బీఐ తిరస్కరించింది. ఇక్కడ బోర్డు లిస్టింగ్‌కు సుముఖంగానే ఉన్నట్లు తెలుస్తున్నా, టాటా ట్రస్ట్స్ అధినేత నోయల్ టాటా దీనిని వ్యతిరేకిస్తున్నారు. టాటా సన్స్ లిస్టింగ్ అయితే గ్రూప్ వ్యాపార విలువలు దెబ్బతింటాయని, 30-40 వేల మంది వాటాదారులు చేరితే ఒత్తిడి ఉంటుందని చెబుతున్నారు. భవిష్యత్తులో లాభాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చే అవకాశం రావొచ్చని, సేవా కార్యక్రమాలు పక్కదారి పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆర్బీఐ లేఖ నేపథ్యంలో మరి ఇప్పుడు టాటా సన్స్ లిస్టింగ్‌కు సంబంధించి ఎలాంటి నిర్ణయం వస్తుందో వేచి చూడాలి.

ముగ్గురు అగ్రనేతల భేటీ



ముంబై : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ , రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ గురువారం భేటీ కాబోతున్నారు. వచ్చే వారం జరగనున్న ఆసియా-పసిఫిక్ ఎకనమిక్ సమ్మిట్ సందర్భంగా ఈ ముగ్గురు ప్రపంచ నేతలు కలిసి చర్చలు జరపబోతున్నారు. చైనా టెక్ హబ్‌గా పేరొందిన షెంజెన్ నగరం దీనికి వేదిక కానుంది. ముగ్గురు అగ్రనేతలు కలవడం అనేది అరుదైన ఘట్టమే అయినప్పటికీ.. ఈ చర్చల వల్ల వచ్చే ఫలితం మాత్రం పెద్దగా ఉండకపోవచ్చనే అంచనాలు ఉన్నాయి.గత ఏడాది అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం జరిగింది. అమెరికా సుంకాలు విధించగా.. చైనా కూడా ప్రతీకార సుంకాలు విధించింది. ఈ పరిస్థితుల్లో ట్రంప్ అమెరికా పర్యటనకు వెళ్లగా.. ఈ విభేధాలను పక్కనబెట్టి ఆయనకు జిన్‌పింగ్ సాదర స్వాగతం పలికారు. ట్రంప్ ఇప్పుడు మరోసారి చైనా పర్యటనకు వెళ్తున్నారు.అమెరికా, రష్యా మధ్య అణ్వాయుధ ఒప్పందం 'న్యూ స్టార్ట్' ఫిబ్రవరిలో ముగిసింది. ఈ ఒప్పందాన్ని మరో రెండేళ్లు పొడిగించాలని పుతిన్ కోరినప్పటికీ.. ట్రంప్ తిరస్కరించారు. దానికి బదులుగా చైనాను కూడా కలుపుకొని మరో కొత్త, మెరుగైన ఒప్పందాన్ని చేసుకుందామని ఆయన ప్రతిపాదించారు.అయితే అమెరికా, రష్యాల వద్ద చెరో 5 వేలకుపైగా అణ్వాస్త్రాలు ఉన్నాయి. చైనా దగ్గర 600 అణ్వాయుధాలు మాత్రమే ఉన్నాయి. అమెరికా, రష్యాతో పోలిస్తే తమ దగ్గర ఉన్న అణ్వాయుధాలు తక్కువ కావడంతో.. ఈ రెండు దేశాలతో అణు ఒప్పందం చేసుకోవడం పట్ల చైనా ఆసక్తి చూపడం లేదు.పుతిన్, జిన్‌పింగ్ మధ్య బలమైన స్నేహ సంబంధాలు ఉన్నాయి. 2013లో జిన్‌పింగ్ చైనా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి వీరిద్దరూ ఇప్పటి వరకు 40 సార్లకుపైగా కలుసుకున్నారు. చైనా, రష్యా మధ్య బలమైన వాణిజ్య సంబంధాలు ఉన్నాయి. మరోవైపు ట్రంప్, జిన్‌పింగ్ సైతం ఏడు సందర్భాల్లో భేటీ అయ్యారు. ఈ ఏడాది సెప్టెంబర్లో జిన్‌పింగ్ వాషింగ్టన్ పర్యటనకు వెళ్లారు.డొనాల్డ్ ట్రంప్ ఇటీవల రష్యాతో డీజిల్ కొనుగోలు కోసం ఒప్పందం చేసుకున్నారు. మాస్కోపై ఆంక్షలు ఎత్తివేసిన ట్రంప్.. భారీగా ఇంధనం ఎగుమతి చేయడానికి రష్యాకు అవకాశం ఇచ్చారు. రష్యా ఆయిల్ రిఫైనరీలపై ఉక్రెయిన్ దాడులు చేస్తుండటంతోనే ఇంధన ధరలు పెరుగుతున్నాయని ట్రంప్ ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో ట్రంప్, పుతిన్, జిన్‌పింగ్ భేటీ అవుతుండటంతో.. తమ ప్రమేయం లేకుండానే ఉక్రెయిన్ ఒప్పందం గురించి చర్చ జరిగే అవకాశం ఉందని ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆందోళన చెందుతున్నారు.పసిఫిక్ మహా సముద్రం తీర ప్రాంత దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్యం, పెట్టుబడులను ప్రోత్సహించడం, ప్రాంతీయ ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం లక్ష్యంగా ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార కూటమి 1989లో ఆస్ట్రేలియా రాజధాని కాన్‌బెర్రాలో ఏర్పాటైంది. ఆస్ట్రేలియా, బ్రూనై, ఇండోనేసియా, న్యూజిలాండ్, జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్, మలేసియా, థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్‌తోపాటు అమెరికా, కెనడా దేశాలు ఈ కూటమిలో వ్యవస్థాపక సభ్య దేశాలుగా ఉన్నాయి. 1991 నుంచి 1998 మధ్య చైనా, తైవాన్, హాంగ్‌కాంగ్, మెక్సికో, రష్యా, చిలీ, పెరూ, పాపువా న్యూ గినియా, వియత్నాం చేరడంతో సభ్య ఆర్థిక వ్యవస్థల సంఖ్య 21కి చేరింది.ంఖఇఅలో భారత్ సభ్యదేశం కాదు. ఈ కూటమిలో చేరేందుకు 1991లోనే భారత్ దరఖాస్తు చేసుకుంది. కానీ భారత్ హిందూ మహా సముద్ర ప్రాంత దేశమని, పసిఫిక్ మహాసముద్ర తీర ప్రాంత దేశం కాదనే సాకుతో చేర్చుకోలేదు. దీంతో ఈ కూటమి సమావేశాలకు అథిగా ఆహ్వానిస్తే తప్పితే భారత్ హాజరు కావడం లేదు. 2014లో ప్రత్యేక అతిథిగా ఈ సమావేశానికి హాజరు కావాలని జిన్‌పింగ్ తొలిసారిగా ఆహ్వానించారు. అయితే ప్రధాని మోదీ హాజరు కాలేదు. 2023లో అమెరికా ఆతిథ్యం ఇచ్చిన సదస్సుకు కూడా భారత్‌కు ఆహ్వానం అందింది. ఆ సదస్సులో మోదీకి బదులుగా వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ హాజరయ్యారు. సమావేశాలు 2026 నవంబర్ 16-18 తేదీల మధ్య చైనాలో జరుగుతుండగా.. ప్రధాని మోదీ దాదాపు అదే సమయంలో పిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరగనున్న ఏసియాన్-ఇండియా సదస్సుతోపాటు ఈస్ట్ ఆసియా శిఖరాగ్ర సమావేశాల్లో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. యాక్ట్ ఈస్ట్ విధానంలో భాగంగా ఈ సదస్సులకు భారత్ అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ట్రంప్-జిన్‌పింగ్-పుతిన్ భేటీ కాబోతున్న షెన్‌జెన్, ఆసియాన్ సదస్సు జరగనున్న మనీలా నగరాల మధ్య దూరం 1200 కి.మీ. లోపే కావడం గమనార్హం.

యుద్ధంలోనూ ఓడినట్టేనా?

మధ్యంతర ఎన్నికలు కాస్తదూరంగా ఉన్నప్పుడు, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దాదాపు ప్రతీరోజూ ఇరాన్‌ను అమెరికాతో కాళ్ళబేరానికి రాకపోతే దుంపనాశనం తప్పదని బెదిరించేవారు. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ ఆయన స్వరంలో మార్పువచ్చింది. అవి ముగిసేవరకూ ఇరాన్‌మీద కయ్యానికి కాలుదువ్వనని హామీ ఇచ్చారు, మాట నిలబెట్టుకున్నారు కూడా. ఇప్పుడు ఎన్నికలు ముగిశాయి కనుక ఆయన మళ్ళీ భేరీలు మోగించాలి, రణనినాదాలు చేయాలి. కానీ, తిరిగి యుద్ధంలోకి దిగే, లేదా కొనసాగించే ఆలోచన తనకు లేదన్నట్టుగా ఆయన మాట్లాడుతున్నారు. తమ గల్ఫ్ మిత్రదేశాలు యుద్ధం వద్దంటూ అదేపనిగా ఒత్తిడిచేస్తున్నాయని, తాను కూడా కాలుదువ్వే ఆలోచనలో లేనన్నది ఆయన వ్యాఖ్యల సారాంశం. ఇదంతా మధ్యంతర ఎన్నికల ఫలితాల ప్రభావమే అన్నది ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. ట్రంప్ వీరంగాలను మిగతా ప్రపంచమంతా చేష్టలుడిగి చూస్తూంటే, అమెరికన్ ఓటరే ఆయనకు ముకుతాడు వేశాడు. ఇరాన్‌మీద తాము చేస్తున్నది యుద్ధం కాదనీ, అది ఎప్పుడు ముగుస్తుందో తెలియదని ఆ మధ్యన వ్యాఖ్యానించిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌కు కూడా ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుక్షణమే అది యుద్ధమేనని జ్ఞానోదయం కలిగింది. ఇరాన్‌తో పెట్టుకున్నందువల్లనే ఘోరంగా ఓడిపోయామని గోసపడ్డాడు ఆయన. వాన్స్ వ్యాఖ్యలు నిజమేనని అధ్యక్షులవారు కూడా ఒప్పుకుంటూనే, ఇరాన్‌వద్ద అణ్వాయుధాలు లేకుండా చేయడానికి యుద్ధం తప్పదం లేదని సమర్థించుకున్నారు. ట్రంప్, వాన్స్ మధ్య ఇరాన్ యుద్ధం అగాధాన్ని పెంచిందని, వాన్స్ తన రాజకీయ భవిష్యత్తు విషయంలో పునరాలోచనలో పడ్డారని, ఒకప్పుడు ట్రంప్ తరువాత కాబోయే అధ్యక్షుడు అనుకున్న ఈయన 2028 ఎన్నికల్లో పోటీచేయాలా వద్దా అన్న సంశయంలో మునిగితేలుతున్నారని వార్తలు విన్నాం. యుద్ధానికి దూరంగా జరుగుతూ ఇలా చేతులు దులిపేసుకుంటున్న వాన్స్‌ను ట్రంప్ ఇరాన్ చర్చల నుంచి తప్పించేసి, డెమోక్రాటిక్ పార్టీ పాలనలో ఉన్న రాష్ట్రాల్లో అవినీతి, నేరాలమీద పనిచేయమంటూ పంపేశారు. ఇరాన్‌ను అణ్వాయుధరహితం చేయడానికే యుద్ధమనీ, అది ఆగాలంటే ఇరాన్ దిగివచ్చి తనతో ఒప్పందం కుదుర్చుకోవాలని మొన్నటివరకూ అంతగట్టిగా చెప్పిన ట్రంప్ ఇప్పుడు ఎలాంటి ఒప్పందం అవసరం లేదంటున్నారు. ఇరాన్‌కు చెందిన వందల బిలియన్ డాలర్లు, హార్ముజ్ జలసంధి తన గుప్పిట్లోనే ఉన్నాయి కనుక, ఇరాన్ ఆర్థికవ్యవస్థ తనకు తానుగానే కుప్పకూలిపోతోంది కనుక యుద్ధం అవసరం లేకుండానే దానంతటదే దారికి వస్తుందంటున్నారు ఆయన. అన్ని సభల్లోనూ డెమోక్రాట్లకు ఆధిపత్యం కట్టబెట్టిన ఎన్నికల ఫలితాలే కాదు, సంప్రదాయ రిపబ్లికన్ ఓటర్లకు సైతం తనమీద మనసు విరిగిపోవడానికి ఇరాన్‌తో యుద్ధం, దాని పర్యవసానాలే కారణమని పలుసర్వేలు కూడా నిర్ధారించిన నేపథ్యంలో, మళ్ళీ ఆ జోలికి పోవద్దని ట్రంప్ అనుకొని ఉంటారు. గత పాలకుల మాదిరిగా ఎడతెగని యుద్ధాలు చేయనని, ఎవరి ప్రయోజనాలకోసమో అమెరికా సైన్యాన్ని, అమెరికన్ల కష్టార్జితాన్ని బలిపెట్టనని హామీ ఇచ్చి మరీ అధికారంలోకి వచ్చారు ట్రంప్. నోబెల్ పీస్ ప్రైజ్‌కు తనను మించిన అర్హులెవరూ లేరంటూ అది తనకు రానందుకు కూడా ఆగ్రహించారు, అలిగారు. ఇరాన్‌తో ఆయన యుద్ధం యావత్ ప్రపంచాన్ని తీవ్ర కష్టనష్టాల్లోకి నెట్టింది. 2018లో బరాక్ ఒబామా హయాంలో ఇరాన్‌తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఏకపక్షంగా రద్దుచేసిన ఆయన, గత ఏడాది జూన్‌లో ఇరాన్ మీద ఇజ్రాయెల్‌తో కలిసి తానూ బాంబులేశారు. ఆ దెబ్బతో ఇరాన్ అణుకార్యక్రమాన్ని సమూలంగా నాశనం చేశానని గొప్పలు చెప్పుకొని, ఎనిమిదినెలలు కూడా తిరక్కుండా మళ్ళీ అదే అణు కార్యక్రమం పేరిట యుద్ధం ప్రకటించారు. హార్ముజ్ జలసంధిని మూసివేసిన ఇరాన్ ఇంధనధరలు పెరిగేట్టు చేసి ట్రంప్ కాళ్ళకింద సెగరాజేయడంతో ఎన్నికల్లో ఓడిన ఆయన ఇప్పుడు వెనకడుగువేయాల్సి వచ్చింది. యుద్ధం, ఒప్పందం రెండూ అక్కరలేదన్న ఈ వైఖరి సరైనది కాదు. యుద్ధం ఆపేయాలని ఆయన నిజంగానే అనుకుంటున్నపక్షంలో దౌత్యం ద్వారా మాత్రమే దానిని ముగించాలి. అందుకు ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకోవాలి.

భారత్-ఆసియాన్ బంధం మరింత బలోపేతం

మనీల (ఫిలిప్పీన్స్): ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రత, స్థిరత్వాన్ని బలోపేతం చేయడంతోపాటు ప్రపంచ ఆర్థికాభివృద్ధికి పరస్పర సహకారం ఎంతో అవసరమని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. దేశాల మధ్య పోటీ కంటే సహకారానికే ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. భారత్, ఆసియాన్ దేశాలు కలిసి పనిచేస్తే ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని శాంతి, స్థిరత్వానికి కేంద్రంగా తీర్చిదిద్దవచ్చని అభిప్రాయపడ్డారు. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగిన క్వాడ్ సమావేశం, 23వ భారత్-ఆసియాన్ సదస్సుల్లో పాల్గొన్న ఆయన ప్రాంతీయ సహకారం, భద్రత, వాణిజ్యం, సాంకేతికత, పెట్టుబడులపై తన ఆలోచనలను వెల్లడించారు. మారుతున్న అంతర్జాతీయ పరిస్థితుల్లో భారత్ కీలక భాగస్వామిగా ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.

ఇండో-పసిఫిక్‌కు క్వాడ్ భరోసా

భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా సభ్య దేశాలుగా ఉన్న క్వాడ్ కూటమి కేవలం నాలుగు దేశాల ప్రయోజనాలకే పరిమితం కాదని మోదీ పేర్కొన్నారు. మొత్తం ఇండో-పసిఫిక్ ప్రాంతానికి విశ్వసనీయమైన పరిష్కారాలను అందించడమే కూటమి లక్ష్యమని వివరించారు. సముద్ర భద్రత, విశ్వసనీయ సరఫరా గొలుసులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రకృతి విపత్తుల సమయంలో సహాయక చర్యలు వంటి అనేక రంగాల్లో క్వాడ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. భారత్ ఈ కూటమిని నిర్మాణాత్మకమైన, విశ్వసనీయ భాగస్వామ్యంగా పరిగణిస్తోందని స్పష్టం చేశారు. 2007లో నాలుగు దేశాల అధికారులు తొలిసారిగా మనీలాలో సమావేశమయ్యారని, 2017లో ఇదే నగరంలో క్వాడ్ చర్చలు తిరిగి ప్రారంభమయ్యాయని మోదీ గుర్తుచేశారు. ఇప్పుడు 2026లో మరోసారి మనీలాలో సమావేశం కావడం చారిత్రక మైలురాయిగా అభివర్ణించారు. గత ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు నాలుగు దేశాల విదేశాంగ మంత్రులు ఐదుసార్లు సమావేశం కావడం పరస్పర నిబద్ధతకు నిదర్శనమన్నారు. క్వాడ్ తదుపరి దశలో మరింత స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు.

భారత్-ఆసియాన్ బంధం మరింత బలోపేతం

ప్రపంచం వరుస సంక్షోభాలను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో భారత్, ఆసియాన్ దేశాల మధ్య సహకారం మరింత అవసరమని మోదీ అన్నారు. 23వ భారత్-ఆసియాన్ సదస్సులో మాట్లాడుతూ ప్రపంచ జనాభాలో దాదాపు నాలుగో వంతుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ రెండు ప్రాంతాలకు అంతర్జాతీయంగా ప్రత్యేక స్థానం ఉందని గుర్తుచేశారు. శాంతి, స్థిరత్వం, పరస్పర విశ్వాసం ఆధారంగా భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఈ ఏడాది ఆసియాన్ సదస్సు ఇతివృత్తమైన 'నావిగేటింగ్ అవర్ ఫ్యూచర్ టుగెదర్' (మన భవిష్యత్తును కలిసి నిర్మించుకోవడం) ప్రస్తుత



ప్రపంచ పరిస్థితులకు ఎంతో అనువైనదని పేర్కొన్నారు. భారత్, ఆసియాన్ దేశాలు సమన్వయంతో పనిచేస్తే ప్రాంతీయంగా ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా అధిగమించవచ్చన్నారు.

యాక్ట్ ఈస్ట్ పాలసీతో కొత్త అవకాశాలు

భారత్ అనుసరిస్తున్న యాక్ట్ ఈస్ట్ విధానం ఆసియాన్ దేశాలతో సంబంధాలను మరింత బలోపేతం చేస్తోందని ప్రధాని తెలిపారు. గతంలో సాంస్కృతిక, చారిత్రక సంబంధాలకే పరిమితమైన భాగస్వామ్యం ఇప్పుడు డిజిటల్ సాంకేతికత, రక్షణ, అంతరిక్షం, వాణిజ్యం, పెట్టుబడులు వంటి విస్తృత రంగాలకు విస్తరించిందన్నారు. 2014 నుంచి భారత్, ఆసియాన్ దేశాల మధ్య ప్రజా సంబంధాలను పెంపొందించేందుకు 100కు పైగా కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. దాదాపు 250 క్విక్ ఇంపాక్ట్ ప్రాజెక్టులను చేపట్టడంతోపాటు నైపుణ్యాభివృద్ధి కోసం 10 వేలకు పైగా స్కాలర్‌షిప్‌లు అందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమాలు యువతకు కొత్త అవకాశాలు కల్పించడంతో పాటు ఇరు ప్రాంతాల మధ్య స్నేహ సంబంధాలను బలోపేతం చేస్తున్నాయని పేర్కొన్నారు.

పర్యాటకం, రవాణాకు ప్రాధాన్యం

భారత్, ఆసియాన్ దేశాల మధ్య రవాణా, పర్యాటక రంగాల్లోనూ గణనీయమైన పురోగతి సాధిస్తున్నట్లు మోదీ తెలిపారు. భారత్ నుంచి ఆసియాన్‌లోని తొమ్మిది దేశాలకు నేరుగా విమాన సర్వీసులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రజల మధ్య రాకపోకలు పెరగడం వల్ల పర్యాటకం, వాణిజ్యం, సాంస్కృతిక సంబంధాలకు మరింత ఊతం లభిస్తోందన్నారు. ఆసియాన్ కమ్యూనిటీ విజన్ 2045, వికసిత్ భారత్ 2047 లక్ష్యాలు పరస్పరం అనుసంధానమై ఉన్నాయని ప్రధాని అభిప్రాయపడ్డారు. భారత్ అభివృద్ధి, ఆసియాన్ దేశాల అభివృద్ధి ఒకదానికొకటి తోడ్పడతాయని పేర్కొన్నారు. ఆసియాన్ ఐక్యతకు, ప్రాంతీయ వ్యవహారాల్లో ఆ సంస్థకు ఉన్న కేంద్ర స్థానానికి భారత్ ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటుందని హామీ ఇచ్చారు.

ఆసియాన్ దేశాలకు మోదీ కీలక ప్రతిపాదనలు

భారత్-ఆసియాన్ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు ప్రధాని మోదీ పలు ప్రతిపాదనలు చేశారు. ఆసియాన్ దేశాల పర్యాటకులకు ఉచిత ఈ-వీసాల సౌకర్యం కల్పించడం, దీర్ఘ కాలిక సముద్ర సహకార ప్రణాళిక రూపొందించడం, అణు శక్తి సాంకేతికతలో పరస్పర సహకారం, కీలక ఖనిజాల రంగంలో భాగస్వామ్యాన్ని పెంచడం వంటి అంశాలను ప్రతిపాదించారు. విద్య, యువజన మార్పిడి, పర్యాటకం, ఇంధనం, ఆధునిక సాంకేతికత, సముద్ర భద్రత వంటి రంగాల్లో సహకారాన్ని విస్తరించాలని సూచించారు. ఈ ప్రతిపాదనలు రెండు ప్రాంతాల మధ్య ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలకు కొత్త దిశను చూపుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

సింగపూర్‌తో పెట్టుబడులు.. సెమీకండక్టర్లపై చర్చలు

మనీలాలో పర్యటన సందర్భంగా సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునే అంశాలపై చర్చించారు. పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణలు, సెమీకండక్టర్లు, ఆధునిక తయారీ రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంచుకోవాలని నిర్ణయించారు. 2025 సెప్టెంబర్‌లో సింగపూర్ ప్రధాని భారత్ పర్యటన సందర్భంగా రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక అమలుపైనా సమీక్షించారు. త్వరలో ఆసియాన్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్న లారెన్స్ వాంగ్‌కు మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

థాయ్‌లాండ్‌తో రక్షణ, భద్రతా సహకారం

థాయ్‌లాండ్ ప్రధాని అనుతిన్ చార్న్‌విరాకుల్‌తోనూ మోదీ సమావేశమయ్యారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయనకు అభినందనలు తెలిపారు. ఇరు దేశాల మధ్య రక్షణ, భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, రవాణా అనుసంధానం, డిజిటల్ సాంకేతికత, పర్యాటక రంగాల్లో సహకారాన్ని పెంచుకోవడంపై చర్చించారు. భారత్, థాయ్‌లాండ్ మధ్య శతాబ్దాలుగా కొనసాగుతున్న చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంబంధాలను మోదీ గుర్తుచేశారు. భారత్ యాక్ట్ ఈస్ట్ విధానం, థాయ్‌లాండ్ యాక్ట్ వెస్ట్ విధానం పరస్పరం సహకరించుకునేలా ఉన్నాయని పేర్కొన్నారు. బిమ్‌స్టెక్, మెకాంగ్-గంగా సహకార వేదికలతోపాటు ఇతర ప్రాంతీయ వేదికల్లోనూ కలిసి పనిచేయాలని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు.

క్వాడ్ ద్వారా ఇండో-పసిఫిక్ ప్రాంత భద్రతకు భరోసా కల్పించడం, ఆసియాన్‌తో ఆర్థిక, సాంకేతిక, వ్యూహాత్మక సంబంధాలను విస్తరించడం ద్వారా భారత్ తన అంతర్జాతీయ భాగస్వామ్యానికి కొత్త దిశను నిర్దేశిస్తోంది. శాంతి, స్థిరత్వం, పరస్పర సహకారమే భవిష్యత్తు ప్రపంచానికి మార్గమని మోదీ తన ప్రసంగాల ద్వారా స్పష్టం చేశారు.

వాయు కాలుష్యంలో 40 శాతం బాధ్యత నాదే

న్యూఢిల్లీ: దేశంలో పెరుగుతున్న వాయు కాలుష్యానికి రవాణా రంగం కూడా ప్రధాన కారణమని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అంగీకరించారు. దేశంలో వాయు కాలుష్యంలో 40 శాతానికి తాను బాధ్యత వహిస్తున్నానని వ్యాఖ్యానించారు. రహదారుల అభివృద్ధి, వాహనాల సంఖ్య పెరుగుదల, పెట్రోల్, డీజిల్ వినియోగం వంటి అంశాలు పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. రవాణా రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులకు విధాన నిర్ణేతగా తనకూ బాధ్యత ఉందని స్పష్టం చేశారు. ఢిల్లీలో నిర్వహించిన 14వ సీఐఐ బయోఎనర్జీ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

అభివృద్ధితోపాటు పర్యావరణ పరిరక్షణ


దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్నప్పటికీ పర్యావరణంపై పడుతున్న ప్రభావాన్ని విస్మరించకూడదని గడ్కరీ అభిప్రాయపడ్డారు. మెరుగైన రహదారులు అందుబాటులోకి రావడంతో వాహనాల కొనుగోళ్లు, వినియోగం పెరుగుతున్నాయని, ఫలితంగా ఇంధన వినియోగం, వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలు కూడా అధికమవుతున్నాయని వివరించారు. అభివృద్ధి కార్యక్రమాలతోపాటు కాలుష్య నియంత్రణకు సమాంతరంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

రూ.22 లక్షల కోట్లకు ఆటోమొబైల్ రంగం

తాను మంత్రిత్వ శాఖ బాధ్యతలు చేపట్టిన సమయంలో దేశ ఆటోమొబైల్ పరిశ్రమ విలువ రూ.14 లక్షల కోట్లుగా ఉండేదని, ప్రస్తుతం అది రూ.22 లక్షల కోట్లకు చేరిందని గడ్కరీ తెలిపారు. ప్రపంచ ఆటోమొబైల్ పరిశ్రమలో ఏడో స్థానంలో ఉన్న భారత్ మూడో స్థానానికి ఎదిగిందని పేర్కొన్నారు. ఈ వృద్ధి దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తున్నప్పటికీ సంప్రదాయ ఇంధనాలపై ఆధారపడటం వల్ల పర్యావరణ సమస్యలు పెరుగుతున్నాయని వివరించారు.

ప్రత్యామ్నాయ ఇంధనాలే పరిష్కారం

పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని క్రమంగా తగ్గించి ప్రత్యామ్నాయ ఇంధన వ్యవస్థలను ప్రోత్సహించాలని గడ్కరీ



సూచించారు. ఇథనాల్, మిథనాల్, బయోడీజిల్, హైడ్రోజన్, విద్యుత్ ఆధారిత వాహనాల వినియోగాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మార్పుల ద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించడంతోపాటు విదేశీ ఇంధన దిగుమతులపై ఆధారపడటాన్ని కూడా తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. పర్యావరణ పరిరక్షణతోపాటు దేశ ఇంధన భద్రతకు ప్రత్యామ్నాయ ఇంధనాలు కీలకంగా మారతాయని పేర్కొన్నారు.

వ్యర్థాల నుంచి ఇంధనం తయారీ

వ్యవసాయ వ్యర్థాలు, పశువుల పేడ, సేంద్రియ వ్యర్థాలను ఇంధన ఉత్పత్తికి ఉపయోగించుకోవాలని గడ్కరీ సూచించారు. వీటి ద్వారా బయోఎనర్జీ, కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ఉత్పత్తిని మరింత విస్తరించవచ్చన్నారు. ముఖ్యంగా పంట కోత అనంతరం మిగిలే వ్యవసాయ అవశేషాలను తగలబెట్టకుండా ఇంధన తయారీకి వినియోగిస్తే ద్వంద్వ ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు.

రైతులకు అదనపు ఆదాయం.. కాలుష్యానికి అడ్డుకట్ట

పంట వ్యర్థాలను కాల్చడం వల్ల గాలిలోకి చేరే పొగ, హానికరమైన కాలుష్య కారకాలను తగ్గించేందుకు బయోఎనర్జీ ఉత్పత్తి ఉపయోగపడుతుందని గడ్కరీ అభిప్రాయపడ్డారు. వ్యవసాయ అవశేషాలను ఇంధన తయారీ సంస్థలకు అందించడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బయోగ్యాస్ పరిశ్రమలకు అవకాశాలు పెరగడంతో ఉపాధి కల్పనకు కూడా దోహదపడుతుందని వివరించారు. మొత్తంగా రహదారుల అభివృద్ధి, ఆటోమొబైల్ రంగం విస్తరణతోపాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని గడ్కరీ తన వ్యాఖ్యల ద్వారా స్పష్టం చేశారు. సంప్రదాయ ఇంధనాల నుంచి ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు రవాణా రంగం మళ్లితేనే కాలుష్య నియంత్రణ, ఇంధన స్వావలంబన లక్ష్యాలను సాధించగలమన్నది ఆయన ప్రసంగంలోని ప్రధాన సందేశం.

మోదీ ప్రభుత్వ విధానాలే ద్రవ్యోల్బణానికి కారణం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఆర్థిక నిర్వహణలో లోపాలు, ప్రజావ్యతిరేక విధానాల కారణంగానే దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరుగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ధరల పెరుగుదలతో సామాన్య కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని విమర్శించింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు ఉపశమనం కల్పించాల్సిన ప్రధాని నరేంద్ర మోదీ రాజకీయ కార్యక్రమాల్లోనే నిమగ్నమై ఉన్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు మంగళవారం 'ఎక్స్' వేదికగా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గత ఏడాది కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా పెరిగాయని జైరాం రమేశ్ పేర్కొన్నారు. నెయ్యి, వంట నూనెల ధరలు 75 శాతం, కూరగాయల ధరలు 73 శాతం, బియ్యం, గోధుమలు, ఇతర ధాన్యాల ధరలు 71 శాతం మేర పెరిగాయని ఆయన వెల్లడించారు. పాలు, పాల ఉత్పత్తుల ధరలు 65 శాతం, పప్పుధాన్యాల ధరలు 62 శాతం పెరిగినట్లు తెలిపారు. కొన్ని నివేదికల ప్రకారం ప్రతి పది కుటుంబాల్లో ఆరు కుటుంబాలు గృహ అవసరాల కోసం గత ఏడాదితో పోలిస్తే 20 శాతం అధికంగా ఖర్చు చేస్తున్నాయని వివరించారు. పెరుగుతున్న ధరల ప్రభావంతో 74 శాతం మంది ప్రజలు అనవసర ఖర్చులను తగ్గించుకుంటుండగా, 50 శాతం మంది కనీస అవసరాలకు సంబంధించిన వస్తువుల కొనుగోళ్లను కూడా తగ్గించుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఈ పరిణామాలు సామాన్య కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై ఒత్తిడిని పెంచుతున్నాయని ఆరోపించారు. ధరల పెరుగుదల ప్రభావం కేవలం వినియోగదారులకే పరిమితం కాలేదని, వ్యాపార రంగంపైనా పడుతోందని జైరాం రమేశ్ అన్నారు. అమెరికా సుంకాలు, ముడి పదార్థాల ధరల పెరుగుదల, ప్రభుత్వ ఉదాసీనత కారణంగా ఒక్క నోయిడాలోనే ఏడాది వ్యవధిలో 200 వస్త్ర కర్మాగారాలు మూతపడ్డాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా వస్త్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలకు ఇది ఒక ఉదాహరణ మాత్రమేనని వ్యాఖ్యానించారు. ద్రవ్యోల్బణం కారణంగా ప్రజల ఇళ్లలో ఆహార వినియోగం తగ్గుతోందని, పరిశ్రమలు మూతపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజల కష్టాలను గుర్తించి ఉపశమనం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై కాంగ్రెస్ గత వారం కూడా కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుంది. దేశంలో కొనసాగుతున్న పరిస్థితిని 'అమృత్ కాల్'గా కాకుండా 'మెహంగాయా కా భూచాల్' (ద్రవ్యోల్బణ భూకంపం)గా అభివర్ణించింది. పెరుగుతున్న ఖర్చులతో మధ్యతరగతి, పేద కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొంటూ, ధరల నియంత్రణకు కేంద్రం సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. ధరల పెరుగుదలతో కుటుంబాల పొదుపు తగ్గిపోతోందని, అప్పుల భారం పెరుగుతోందని జైరాం రమేశ్ గతంలోనూ ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యతరగతి, పేద కుటుంబాలపై ద్రవ్యోల్బణం చూపుతున్న ప్రభావాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించాలని కోరారు. సామాన్యుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎప్పుడు చర్యలు తీసుకుంటుందని ప్రశ్నించారు. నిత్యావసరాల ధరలు, గృహ ఖర్చులు, పరిశ్రమల పరిస్థితిపై కాంగ్రెస్ చేస్తున్న ఈ విమర్శల నేపథ్యంలో ద్రవ్యోల్బణ నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై చర్చ మరోసారి తెరపైకి వచ్చింది

శబరిమలలో తిరుపతి తరహా మెగా ప్రాజెక్టు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమలలో తిరుమల-తిరుపతి తరహాలో భారీ మౌలిక వసతుల ప్రాజెక్టును అమలు చేయనున్నట్లు కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ ప్రకటించారు. శబరిమలకు వచ్చే అయ్యప్ప భక్తులకు సమగ్రమైన రీతిలో అత్యాధునిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఈ మెగా ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయం (సియాల్) ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శబరిమల యాత్రికుల సహాయ కేంద్రాన్ని (ఫెసిలిటేషన్ సెంటర్) ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కేరళలో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని విస్తృతంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. అయ్యప్ప భక్తులు శబరిమలలో దర్శనం ముగిసిన వెంటనే వెనుదిరగకుండా, రాష్ట్రంలోని ఇతర ప్రముఖ ఆలయాలను కూడా సందర్శించేలా ఒక ప్రత్యేక నెట్‌వర్క్‌ను రూపొందిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రణాళిక ద్వారా శబరిమలకు వచ్చే భక్తుల సంఖ్య సుమారు 50 శాతం మేర పెరిగే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. శబరిమల దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల కల్పనపై ప్రస్తుతం కొనసాగుతున్న మండల పూజా సీజన్ ముగిసిన తర్వాత ఒక ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే వృశ్చిక మాసం సీజన్ ప్రారంభానికి ముందే అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశామని, పంబ, సన్నిధానంలలో స్వయంగా సమీక్షలు నిర్వహించి ఏర్పాట్లను పర్యవేక్షించినట్లు ఆయన తెలిపారు. మరోవైపు, కొచ్చి విమానాశ్రయంలోని డొమెస్టిక్ అరైవల్ టెర్మినల్ సమీపంలో 5,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ భక్తులకు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. ఇక్కడ శబరిమలకు నేరుగా వెళ్లే కేరళ ఆర్టీసీ బస్సుల కోసం ప్రత్యేక బుకింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ బస్సు సర్వీసులను కూడా ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. దీంతో పాటు డిమాండ్‌కు అనుగుణంగా చార్టర్డ్ బస్సులు, హెలికాప్టర్ బుకింగ్ కౌంటర్, ట్రావెన్‌కోర్ దేవస్వోం బోర్డు హెల్ప్ డెస్క్, ప్రసాదం కూపన్ కౌంటర్లను ఇక్కడ అందుబాటులో ఉంచారు. వీటితో పాటు ప్రీపెయిడ్ ట్యాక్సీ బుకింగ్, శాకాహార భోజన శాల, ఎయిర్ కండిషన్డ్ విశ్రాంతి గదులు, ఉచిత వైఫై, విమానాల రాకపోకలను ఎప్పటికప్పుడు తెలియజేసే ఫ్లైట్ ఇన్ఫర్మేషన్ డిస్‌ప్లే వ్యవస్థను కూడా భక్తుల కోసం ఏర్పాటు చేశారు. దేశ, విదేశాల నుంచి విమానాల్లో వచ్చే అయ్యప్ప భక్తులకు ఈ కేంద్రం ద్వారా ప్రయాణం మరింత సులభతరం కానుంది.

విద్వేషం నుంచి విముక్తి కల్పించి ప్రేమను పంచడమే నా విధి



తల్లిదండ్రులైన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ, సోనియా గాంధీల మధ్య ఉన్న అనుబంధంపై తాను చేసిన వ్యాఖ్యలపై వచ్చిన విమర్శలకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ప్రేమను వ్యక్తపరచడం, అనుభవించడం అనే అంశంపై ఆయన ఒక రాజకీయ ప్రకటనను విడుదల చేస్తూ, దానికి సంబంధించి ఒక ఆలయ శిల్పం ఫొటోను జతచేశారు. సోనియా గాంధీ జీవిత అనుభవాలతో రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సోమవారం రాహుల్ గాంధీ ప్రసంగించారు. ఈ సందర్భంగా తన తల్లిదండ్రుల మధ్య ఉన్న ప్రేమానురాగాలను ఆయన గుర్తుచేసుకున్నారు. భోజనం చేసే ప్రతిసారీ తన తండ్రి రాజీవ్ గాంధీ ఒళ్లో తల్లి సోనియా గాంధీ కూర్చునేవారని రాహుల్ పేర్కొన్నారు. "ప్రతి రోజూ భోజన సమయంలో నాన్న ఉండేవారు, నాన్న ఒళ్లో అమ్మ కూర్చునేది" అని రాహుల్ అనడంతో, వేదికపై ఉన్న సోనియా గాంధీ కాస్త ఇబ్బందిగా నవ్వారు. సాధారణంగా ఇతర కుటుంబాల్లో ఇలాంటి దృశ్యాలు కనిపించవని ఆ తర్వాత తనకు అర్థమైందని, చిన్నతనంలో ఇది సాధారణ విషయమే అనుకుని ఒక స్నేహితుడిని వారి తల్లిదండ్రుల గురించి కూడా అలాగే ప్రశ్నించానని రాహుల్ వివరించారు. రాహుల్ చేసిన ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో పెద్దఎత్తున విమర్శలు, చర్చలు మొదలయ్యాయి. ఈ పరిణామాలపై స్పందించిన రాహుల్ గాంధీ, మంగళవారం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు. పవిత్ర నందిపై శివపార్వతులు కలిసి ఆసీనులైనట్లు ఉన్న ఒక పురాతన ఆలయ శిల్పం చిత్రాన్ని ఆ పోస్ట్‌కు జతచేశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ స్పందిస్తూ.. "బీజేపీ, ఆర్ఎస్ఎస్ మద్దతుదారుల హృదయాల్లో భయం, కోపం, విద్వేషం గూడుకట్టుకున్నాయి. అవి వారిని ప్రేమను అనుభూతి చెందకుండా, వ్యక్తపరచకుండా అడ్డుకుంటున్నాయి. ఒక నిజమైన హిందువుగా వారిని ఈ వలయం నుంచి విముక్తులను చేయడం నా బాధ్యత. తద్వారా వారు కూడా తమ జీవితాల్లో అద్భుతమైన ప్రేమ, అనుబంధాల సౌందర్యాన్ని, ఆనందాన్ని అనుభవించడం ప్రారంభిస్తారు... సత్యం శివం సుందరం" అని పేర్కొన్నారు.

భారత్ లో భారీ పెట్టుబడులకు అమెజాన్ సై

భారత్‌లో పర్యావరణహిత పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను విస్తరించేందుకు ప్రముఖ అంతర్జాతీయ ఈ-కామర్స్, క్లౌడ్ సేవల దిగ్గజం అమెజాన్ భారీ ప్రణాళికను ప్రకటించింది. 2030 నాటికి దేశంలో అదనంగా మరో 7 బిలియన్ డాలర్లను (సుమారు రూ.58 వేల కోట్లకు పైగా) గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల్లో పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే భారత్‌లో పునరుత్పాదక ఇంధన ఒప్పందాల కోసం 4 బిలియన్ డాలర్లను కేటాయించిన సంస్థ, తాజా నిర్ణయంతో తన విస్తరణను మరింత వేగవంతం చేయనుంది. తద్వారా దేశంలో కర్బన రహిత విద్యుత్‌ను అత్యధికంగా కొనుగోలు చేస్తున్న కార్పొరేట్ సంస్థలలో ఒకటిగా అమెజాన్ తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. ఇప్పటికే కేటాయించిన 4 బిలియన్ డాలర్ల నిధుల్లో భాగంగా, మొత్తం 934 మెగావాట్ల (వీఔ) సంయుక్త సామర్థ్యంతో కూడిన నాలుగు సరికొత్త విండ్, సోలార్ ప్రాజెక్టులను అమెజాన్ ప్రకటించింది. వీటిలో కర్ణాటకలో 234 మెగావాట్ల భారీ విండ్ ప్రాజెక్ట్‌తో పాటు మరో 200 మెగావాట్ల హైబ్రిడ్ విండ్-సోలార్ ప్రాజెక్ట్ ఉన్నాయి. ఇందులో 234 మెగావాట్ల విండ్ ప్రాజెక్ట్ ఆసియాలోనే అమెజాన్ చేపట్టిన అత్యంత భారీ పవన విద్యుత్ ఒప్పందం కావడం విశేషం. వీటితో పాటు మధ్యప్రదేశ్‌లో 300 మెగావాట్ల సోలార్ ప్రాజెక్ట్, రాజస్థాన్‌లో 200 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయనున్నారు.

ఈ నాలుగు ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే, భారత్‌లో అమెజాన్ కాంట్రాక్ట్ చేసుకున్న పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 2 గిగావాట్లకు (+ఔ) పైగా చేరుకుంటుంది. ఈ విద్యుత్ దాదాపు 35 లక్షలకు పైగా భారతీయ గృహాల వార్షిక విద్యుత్ అవసరాలను తీర్చడానికి సమానమని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అమెజాన్‌కు సంబంధించి 14 భారీ విండ్, సోలార్ ప్రాజెక్టులతో పాటు 43 ఆన్-సైట్ సోలార్ యూనిట్లు పనిచేస్తున్నాయి. అంతర్జాతీయంగా చూస్తే అమెజాన్ ఆధ్వర్యంలో 40 గిగావాట్లకు పైగా సామర్థ్యంతో సుమారు 700 ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి. ఈ అదనపు 7 బిలియన్ డాలర్ల పెట్టుబడులు అమెజాన్ ప్రపంచవ్యాప్త పర్యావరణ లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నాయని సంస్థ తెలిపింది. 2019 స్థాయితో పోలిస్తే, 2030 నాటికి తమ కార్యకలాపాలకు వినియోగించే విద్యుత్ ద్వారా వెలువడే కర్బన ఉద్గారాల తీవ్రతను 65 శాతం మేర తగ్గించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే 'ది క్లైమేట్ ప్లెడ్జ్' ఒప్పందంలో భాగంగా 2040 నాటికి తమ అన్ని వ్యాపార కార్యకలాపాల్లో 'నెట్ జీరో' కర్బన ఉద్గారాల స్థాయికి చేరుకోవాలని అమెజాన్ భావిస్తోంది. అమెజాన్ తీసుకున్న ఈ భారీ నిర్ణయాన్ని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి స్వాగతించారు. భారత హరిత ఇంధన రంగంపై అంతర్జాతీయ సంస్థలకు పెరుగుతున్న విశ్వసనీయతకు ఈ పెట్టుబడులే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ నిధుల రాకతో దేశీయ విద్యుత్ గ్రిడ్ ఆధునీకరణ వేగవంతం కావడంతో పాటు, నూతన ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఇంధన భద్రత పెరుగుతుందని ఆయన

తొలి విడత నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగింపు

- సర్పంచ్ స్థానాలకు 504, వార్డు సభ్యుల స్థానాలకు 2,795 నామినేషన్లు దాఖలు
- ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా నామినేషన్ల స్వీకరణ
- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ



విజయవాడ, మహానగర్

జిల్లాలో తొలి విడత గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మంగళవారం ప్రశాంతంగా, పారదర్శకంగా ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జిల్లాలో తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించిన నామినేషన్ల ప్రక్రియ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా విజయవంతంగా పూర్తయిందని పేర్కొన్నారు. తొలి విడత ఎన్నికలకు సంబంధించి విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని జి. కొండూరు, ఇబ్రహీంపట్నం, మైలవరం, విజయవాడ రూరల్ మండలాలతో పాటు తిరువూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని రెడ్డిగూడెం మండలంలో నామినేషన్ల స్వీకరణ చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. ఈ ఐదు మండలాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు అభ్యర్థుల నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో సర్పంచ్ స్థానాలకు మొత్తం 504 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 2,795 నామినేషన్లు కలిపి మొత్తం 3,299 నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నామినేషన్ కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు, పటిష్టమైన పోలీసు బందోబస్తు, హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులకు నామినేషన్ల దాఖలులో అవసరమైన సహాయ సహకారాలు అందించడంతో పాటు ఎన్నికల నియమ నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించి, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తి చేసిన ఎన్నికల అధికారులు, సిబ్బంది, పోలీసు శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ ప్రత్యేకంగా అభినందించారు. తదుపరి ఎన్నికల ప్రక్రియలోనూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు



మోపిదేవి, మహానగర్

సుప్రసిద్ధ శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఈఓ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. మంగళవారం స్థానిక దేవస్థానం వద్ద భక్తుల సౌకర్యాలు పరిశీలించారు. కార్తీకమాసం అందులోనూ మంగళవారం కావడంతో భక్తుల రద్దీ దృష్ట్యా తెల్లవారుజాము నుంచే దాసరి శ్రీరామ వరప్రసాదరావు భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ పరిసర ప్రాంతాలలో పర్యటిస్తూ, దేవస్థాన సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా, భక్తులకు కావలసిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. భక్తుల పట్ల మర్యాదగా మెలగాలని సిబ్బందికి చెప్పారు. దేవస్థానానికి భక్తుల రద్దీ అధికంగా ఉన్న నేపథ్యంలో పోలీసులు, దేవస్థాన సిబ్బంది సూచనలు భక్తులు పాటిస్తూ సమన్వయంతో శ్రీ స్వామి, శ్రీ అమ్మవార్ల దర్శనం చేసుకుని, పూజలు జరిపించుకోవాలని ఈ సందర్భంగా దాసరి శ్రీరామ వరప్రసాదరావు భక్తులకు విజ్ఞప్తి చేశారు.

ధాన్యం కొనుగోళ్లకు 155 రైతు సేవా కేంద్రాలు

- లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోలే లక్ష్యం
- ఖరీఫ్ సీజన్‌లో 3.21 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- ఆక్వాన్ తుపాను నేపథ్యంలో ధాన్యం రక్షణకు ప్రత్యేక చర్యలు
- జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ



విజయవాడ, మహానగర్

జిల్లాలో ఖరీఫ్ 2026-27 సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్ల కోసం 155 రైతు సేవా కేంద్రాలను (ఆర్ఎస్‌కే) ఏర్పాటు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 49,389 హెక్టార్లలో వరి సాగు చేయగా, సుమారు 3,21,030 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే అక్టోబర్ 31 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. కొనుగోళ్లలో పారదర్శకత పాటించాలని, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు కొనుగోలు షెడ్యూల్‌ను వాట్సాప్ ద్వారా ముందుగానే తెలియజేసి, ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. గన్నీ సంచులు, హమాలీలు, రవాణా వాహనాలను తగినంతగా అందుబాటులో ఉంచాలని, ఆక్వాన్ తుపాను హెచ్చరికల నేపథ్యంలో ధాన్యం తడవకుండా అవసరమైన ప్రాంతాల్లో టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర అందేలా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. డివిజన్ల వారీగా తిరువూరులో 64, విజయవాడలో 44, నందిగామలో 47 రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులు సమస్యలు ఎదుర్కొంటే జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ 7702003571ను సంప్రదించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.

ఆక్వాన్ నేపథ్యంలో రైతులు సూచనలు పాటించాలి



చల్లపల్లి, మహానగర్

ఆక్వాన్ తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు సూచనలను పాటించాలని మండల వ్యవసాయ అధికారి కే.మురళీకృష్ణ సూచించారు. మంగళవారం చల్లపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి, నష్ట తీవ్రతను తగ్గించుకోవడానికి తగు ముందస్తు చర్యలలో భాగంగా పొలాల్లోనే నీటిని వెంటనే బయటకు పంపించి వేయాలన్నారు. అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున వర్షపు నీరు, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరు వెంటనే బయటకు పోయేలా చిన్న చిన్న కాలువలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముందస్తుగానే మురుగు కాలువలలోని అడ్డంకులను తొలగించుకోవాలన్నారు. కోతకు రాని వరి పంటను ముందస్తుగానే కోయరాదని తెలియజేశారు. కార్యక్రమంలో వీఏఏలు నిహారిక, యువశ్రీ రైతులు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీకి నూతన ఎఫ్ఎఫ్ఎస్ విధానం ప్రారంభం

అమలు తీరును పరిశీలించిన వ్యవసాయ శాఖ కమిషనర్ మనజీర్ జీలానీ సమూన్

విజయవాడ, మహానగర్

జిల్లాలో రైతులకు ఎరువులను పారదర్శకంగా, సులభంగా పంపిణీ చేసేందుకు ప్రవేశపెట్టిన ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ (ఎఫ్ఎఫ్ఎస్) నూతన విధానం మంగళవారం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ విధానం అమలు తీరును రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్, సంచాలకుడు డాక్టర్ మనజీర్ జీలానీ సమూన్ ఇబ్రహీంపట్నంలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఏపీఎంఎస్ యాప్ స్థానంలో ఎఫ్ఎఫ్ఎస్ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు ఆయన తెలిపారు. రైతులు గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, బుకింగ్‌కు ముందు ఏపీఎఫ్ఆర్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. పంట, భూమి విస్తీర్ణం వివరాలను నమోదు చేసిన తర్వాత అవసరమైన ఎరువుల సిఫార్సు పరిమాణాలు యాప్‌లో కనిపిస్తాయని, రైతులు 20 కిలోమీటర్ల పరిధిలోని ఎరువుల దుకాణాన్ని ఎంపిక చేసుకోవచ్చని వివరించారు. బుకింగ్ పూర్తయిన తర్వాత జారీ అయ్యే ప్రత్యేక క్యూఆర్ కోడ్‌తో 48 గంటల్లోపు ఎరువులు కొనుగోలు చేయాల్సి ఉంటుందని, డీలర్లు ఈ-పీఓఎస్ యంత్రం ద్వారా కోడ్‌ను స్కాన్ చేసి ఎరువులు పంపిణీ చేస్తారని తెలిపారు. అనంతరం ఇబ్రహీంపట్నంలోని పీఏసీఎస్ ఎరువుల విక్రయ కేంద్రం, శ్రీ లాస్య ఏజెన్సీస్‌ను సందర్శించి బుకింగ్, విక్రయ ప్రక్రియను పరిశీలించారు. హెల్ప్‌డెస్క్‌ల ద్వారా రైతులకు అందిస్తున్న సహాయంతో పాటు క్యూఆర్ కోడ్ ఆధారంగా జరుగుతున్న విక్రయాలను తనిఖీ చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, ఎరువుల డీలర్లు నూతన యాప్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, రైతులకు బుకింగ్‌లో సహకరించాలని సూచించారు. ప్రారంభ దశలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించి ఎరువుల పంపిణీకి ఆటంకం లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మైలవరం ఏడీఏ ఎం. శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ ఏడీఏ, వ్యవసాయ అధికారి (టెక్నికల్), ఇతర అధికారులు పాల్గొన్నారు.



సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు



విజయవాడ, మహానగర్

ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆధ్వర్యంలోని సుజనా ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఉచిత మొబైల్ 2డీ ఎకో వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. మంగళవారం హెచ్‌బీ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన శిబిరంలో 14 మంది గర్భిణులకు 2డీ ఎకో మేటర్నల్ కార్డియాక్ రిస్క్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. గర్భధారణ సమయంలో తలెత్తే గుండె సంబంధిత సమస్యలను ముందుగానే గుర్తించి ప్రాణాపాయ పరిస్థితులను నివారించడమే ఈ పరీక్షల లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన మహిళలకు అత్యాధునిక వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరంలో డాక్టర్ ఎన్. వంశీ, 2డీ ఎకో టెక్నీషియన్లు సుప్రియ, సింధుప్రియ, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఫౌండేషన్ సిబ్బంది, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఆక్వాన్ తుఫాను నేపథ్యంలో మెగా జాబ్ మేళా వాయిదా

విజయవాడ, మహానగర్

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్.ఆర్.ఆర్ అండ్ సి.వి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 19న నిర్వహించాల్సిన మెగా జాబ్ మేళాను ఆక్వాన్ తుఫాను నేపథ్యంలో వాయిదా వేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాను 26వ తేదీ గురువారం ఉదయం 9.00 గంటలకు మాచవరంలోని ఎస్.ఆర్.ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9032633548 నంబరును సంప్రదించవచ్చని తెలిపారు.

కమిషనరేట్ పరిధిలో 44 రోజుల పాటు నిషేధాజ్ఞలు

విజయవాడ, మహానగర్

స్థానిక సంస్థల రెండో సాధారణ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో 44 రోజుల పాటు నిషేధాజ్ఞలు విధించినట్లు పోలీస్ కమిషనర్, మెట్రోపాలిటన్ ప్రాంత అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ఎస్.వి. రాజశేఖరబాబు తెలిపారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)-2023లోని సెక్షన్ 163 ప్రకారం నవంబర్ 18 నుంచి డిసెంబర్ 31 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో ప్రజా జీవనానికి ఆటంకం కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. నిషేధాజ్ఞలు అమల్లో ఉన్న సమయంలో కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడరాదని స్పష్టం చేశారు. అలాగే కర్రలు, రాళ్లు, ఇతర మారణాయుధాలు పట్టుకుని తిరగకూడదని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.

ఈ నెల 18 నుంచి రెండో దశ నామినేషన్లు

ఈ నెల 20వ తేదీ వరకు దాఖలుకు గడువు : జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, మహానగర్



పంచాయతీ ఎన్నికల రెండోదశకు సంబంధించి ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ ఉంటుందని, ఈ నెల 21వ తేదీన నామినేషన్ల పరిశీలన జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29వ తేదీన పోలింగ్ జరుగుతుందని.. అదేరోజు కౌంటింగ్, ఫలితాల వెల్లడి ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. రెండో దశ ఎన్నికలు నందిగామ రెవెన్యూ డివిజన్‌లోని ఏడు మండలాల్లో 138 గ్రామ పంచాయతీలు, 1,432 వార్డులకు 1,468 పోలింగ్ కేంద్రాల్లో జరగనున్నట్లు వివరించారు. నందిగామ మండలంలో 23 గ్రామపంచాయతీల్లో 228 వార్డులకు, చందర్లపాడు మండలంలో 18 పంచాయతీల్లో 194 వార్డులకు, జగ్గయ్యపేట మండలంలో 19 పంచాయతీల్లో 212 వార్డులకు, పెనుగంచిప్రోలు మండలంలో 15 పంచాయతీల్లో 162 వార్డులకు, వత్సవాయి మండలంలో 25 పంచాయతీల్లో 246 వార్డులకు, కంచికచర్ల మండలంలో 16 పంచాయతీల్లో 178 వార్డులకు, వీరులపాడు మండలంలో 22 పంచాయతీలకు, 212 వార్డులకు ఎన్నికలు జరగనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా సందేహాల నివృత్తికి కమాండ్ కంట్రోల్ కేంద్రం నంబరు (9154970454)లో సంప్రదించవచ్చని తెలిపారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షునికి జడ్పీటీసీ సత్కారం

చల్లపల్లి, మహానగర్



రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును జడ్పీటీసీ సభ్యుడు రావెళ్ల ఉదయ్ కుమార్ మంగళవారం వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఆయన పార్టీ అధ్యక్షుడిని కలిసి చల్లపల్లి మండలంలో కూటమి విజయం గురించి తెలిపారు. జడ్పీటీసీగా పోటీ చేసేందుకు తనకు బి.ఫారం ఇచ్చి అవకాశం కల్పించటం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. జడ్పీటీసీగా విజయం సాధించిన ఉదయ్ కుమారును ఈ సందర్భంగా పల్లా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

బిజినెస్

ఎంతపెద్ద హీరోలోనైనా లోపాలుంటాయ్.. జెన్సన్ హువాంగ్‌కు మద్దతుగా శామ్ ఆల్ట్‌మన్



ఎన్విడియా మాజీ సీఈవో జెన్సన్ హువాంగ్ తాను హీరోలా భావిస్తానని ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ చెప్పారు. అయితే ఎంతపెద్ద హీరోలో అయినా లోపాలు ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. కాగా ఎన్విడియా సీఈవోగా జెన్సన్ హువాంగ్‌ను తిరిగి బాధ్యతల్లోకి తీసుకోవాలని ఇప్పటికే సిలికాన్ వ్యాలీలో కీలకమైన టెక్ ఎగ్జిక్యూటివ్‌లు కంపెనీ బోర్డుపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఈ క్రమంలో ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ కూడా జెన్సన్‌కు మద్దతుగా మాట్లాడటం గమనించవలసిన విషయం. జెన్సన్ లేకుండా ఏఐ విప్లవాన్ని, ఎన్విడియాను ఊహించుకోవడం కష్టమేనని శామ్ ఆల్ట్‌మన్ పేర్కొన్నారు. అయితే జెన్సన్‌ను తిరిగి సంస్థలోకి తీసుకురావాలా వద్దా..? అనే విషయం చెప్పడానికి తనకు తగినంత పరిజ్ఞానం లేదని ఆయన వ్యాఖ్యానించారు. 2023లో ఓపెన్‌ఏఐ నుంచి తనను కొద్దికాలంపాటు తొలగించడాన్ని గుర్తు చేసుకుంటూ.. ఇలాంటి పరిస్థితిపై తనకు వ్యక్తిగతంగా సానుభూతి ఉందని తెలిపారు. ఆ ఘటన జరిగి ఎంతో కాలమైనా నాటి పరిస్థితులు ఎలా ఉండేవో తనకు ఇప్పటికీ గుర్తుందని చెప్పారు. నాడు పలు కారణాలు చూపి ఓపెన్ ఏఐ బోర్డు శామ్ ఆల్ట్‌మన్‌ను తొలగించింది. అయితే సిబ్బంది, పెట్టుబడిదారులు ఆల్ట్‌మన్‌కు మద్దతుగా నిలవడంతో కొద్ది రోజులకే తిరిగి సంస్థలోకి తీసుకున్నారు. కాగా, జెన్సన్‌కు మద్దతిచ్చిన టెక్ దిగ్గజాలలో స్పేస్‌ఎక్స్ సీఈఓ ఎలాన్ మస్క్, ఎపిక్ గేమ్స్ సీఈఓ టిమ్ స్వీనీ, యూట్యూబ్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ చెన్ ఉన్నారు. ఎన్విడియాలోని పలువురు ఉద్యోగులు, వాటాదారులు కూడా జెన్సన్‌ను తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మహీంద్రా ఎలక్ట్రిక్ కారు సరికొత్త రికార్డ్.. భారత్ ఎన్‌క్యాప్ క్రాష్ టెస్టుల్లో 5-స్టార్ రేటింగ్



ప్రముఖ దేశీయ వాహన తయారీ సంస్థ మహీంద్రా నుంచి వచ్చిన సరికొత్త ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ 'ఎక్స్‌ఈవీ 9ఎస్' భద్రతలో సరికొత్త మైలురాయిని అందుకుంది. భారత్ ఎన్‌క్యాప్ (బీఎన్‌సీఏపీ) నిర్వహించిన క్రాష్ టెస్టుల్లో ఈ ఏడు సీట్ల ఈవీ పూర్తి 5-స్టార్ సేఫ్టీ రేటింగ్‌ను కైవసం చేసుకుంది. ఈ రేటింగ్ ఎక్స్‌ఈవీ 9ఎస్ అన్ని వేరియంట్లకు వర్తిస్తుందని మహీంద్రా స్పష్టం చేసింది. భారత్ ఎన్‌క్యాప్ పరీక్షల్లో పెద్దల రక్షణ విభాగంలో 32 పాయింట్లకు గాను 31.15 పాయింట్లు, పిల్లల రక్షణ విభాగంలో 49 పాయింట్లకు గాను 45 పాయింట్లను ఈ కారు సాధించింది. ఫ్రంటల్ డిఫార్మబుల్ బారియర్ టెస్టులో డ్రైవర్ తల, మెడ, ఛాతీ, తొడలు, పాదాలకు 'గుడ్' ప్రొటెక్షన్ లభించింది. సహ ప్రయాణికుడి శరీర భాగాలకు కూడా అత్యుత్తమ రక్షణ లభించగా, ఛాతీ భాగానికి 'అడిక్వేట్' రేటింగ్ వచ్చింది. అలాగే సైడ్ ఇంపాక్ట్, సైడ్ పోల్ ఇంపాక్ట్ టెస్టుల్లోనూ అన్ని శరీర భాగాలకు పూర్తిస్థాయిలో 'గుడ్' రేటింగ్‌ను దక్కించుకుని దృఢత్వాన్ని నిరూపించుకుంది. ప్రయాణికుల భద్రత కోసం ఇందులో మల్టిపుల్ ఎయిర్‌బ్యాగులు, ఈబీడీతో కూడిన ఏబీఎస్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, 360-డిగ్రీల కెమెరా, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్, ఐసోఫిక్స్ మౌంట్స్ వంటి ఫీచర్లు ఉన్నాయి. హైయర్ వేరియంట్లలో అడాప్టివ్ క్రూజ్ కంట్రోల్, లేన్ కీపింగ్ అసిస్ట్, ఆటోమేటిక్ ఎమర్జెన్సీ బ్రేకింగ్ వంటి అధునాతన అడాస్ ఫీచర్లు లభిస్తాయి. ఈ ఈవీ 59ఎఐహెచ్, 70ఎఐహెచ్, 79ఎఐహెచ్ బ్యాటరీ ప్యాక్ ఆప్షన్లతో అందుబాటులో ఉంది. పూర్తి ఛార్జింగ్‌పై గరిష్ఠంగా 679 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యం కలిగి ఉంది.

ఏ నెల సంపాదన ఆ నెలలోనే నీళ్లలా కరిగిపోతోందా?

ఈ మనీ సేవింగ్ టిప్స్ మీ కోసమే..!



మనిషి సంతోషంగా జీవించాలంటే బతకడానికి కావాల్సిన కనీస అవసరాలు తీర్చుకోగలగాలి. ఆ అవసరాలన్నీ డబ్బుతో ముడిపడి ఉంటాయి. అందుకే ప్రతి ఒక్కరు అవకాశాలు, వనరులను బట్టి తమతమ స్థాయిలో డబ్బు సంపాదించే ప్రయత్నం చేస్తుంటారు. అయితే సంపాదించిన డబ్బును ఎలా పొదుపు చేయాలనేది చాలామందికి తెలియదు. అందుకే అతిగా ఖర్చు చేస్తారు. అలా అనవసరపు ఖర్చు చేయడంవల్ల చేతిలో డబ్బు నిలువదు. అత్యవసర పరిస్థితులు ఎదరైనప్పుడు చేతిలో డబ్బులు లేకపోతే అవస్థలు పడాల్సి వస్తుంది. అలాంటి అవస్థలు తప్పాలంటే సంపాదించిన దానిలో నెలకు కనీసం 1% నుంచి 5% అయినా సేవ్ చేయాలని నిపుణులు చెబుతున్నారు. మరి మనీని ఎలా పొదుపు చేసుకోవాలో ఇప్పుడు చూద్దాం..!

కార్డుల వాడకం తగ్గాలి

ఈ రోజుల్లో డెబిట్, క్రెడిట్ కార్డులు, ఫోన్ పే, గూగుల్ పే లాంటి ఆన్‌లైన్ చెల్లింపులు పెరుగుతున్నాయి. చాలామంది నగదుకు బదులుగా వాటినే ఉపయోగించేందుకు ఇష్టపడుతున్నారు. అయితే కార్డులను ఉపయోగించడంవల్ల మీరు సాధారణం కంటే ఎక్కువ డబ్బును ఖర్చు చేస్తారని నిపుణులు అంటున్నారు. ఎందుకంటే మీ కార్డులో నుంచి ఎంత డబ్బు బయటకు వెళ్తుందో పట్టించుకోరని, అతిగా ఖర్చు చేసి తిరిగి చెల్లించాల్సి వచ్చినప్పుడు బాధపడాల్సి వస్తుందని చెబుతున్నారు. కాబట్టి కార్డులకు బదులుగా నగదును ఖర్చులకు వాడితే భయంతో తక్కువ ఖర్చు చేస్తారని అంటున్నారు. దాంతో డబ్బు సేవ్ అవుతుందని చెబుతున్నారు.

అనవసరపు కొనుగోళ్లు వద్దు

చాలామంది ఉపయోగం లేని వస్తువులు కొనడమో.. లేక అవసరం లేని వాటికి అనవసరంగా డబ్బు ఖర్చు చెయ్యడమో చేస్తుంటారు. ఇలా అదనపు వస్తువులకు చేసే ఖర్చు తగ్గించుకోవడానికి ప్రయత్నించాలి. వీలైతే వారం రోజుల్లో ఒక రోజు జీరో ఖర్చు రోజుగా పెట్టుకోండి. ఆ రోజు మాత్రం ఎలాంటి ఖర్చు చెయ్యకుండా డబ్బును సేవ్ చెయ్యండి. ప్రతి వారం మీ ఖర్చును తగ్గించుకోవడానికి ఇది ఒక మంచి మార్గంగా పని చేస్తుందని అంటున్నారు నిపుణులు.

మితంగా పార్టీలు, విహార యాత్రలు

కొందరు ఏ అవకాశం వచ్చినా పార్టీలు, విహార యాత్రలంటూ డబ్బులు ఖర్చు పెట్టేస్తుంటారు. అలా కాకుండా ఇంట్లోనే సరదాగా ఫ్రెండ్స్‌తో ఎంజాయ్ చెయ్యండి. దాంతో డబ్బు కూడా చాలా సేవ్ అవుతుంది. ఇక ఈ రోజుల్లో అందరూ సొంత వాహనాలపైనే ఎక్కువగా ట్రావెలింగ్ చేస్తున్నారు. అయితే ఎక్కువ దూరం వెళ్లాల్సి వచ్చినప్పుడు మీరు కారు లేదా బైక్‌ను ఉపయోగించడం కంటే ప్రజా రవాణాను ఉపయోగిస్తే ఎంతో కొంత ఆదా అవుతుంది. అలాగే లాంగ్ జర్నీస్‌లో బయట ఫుడ్ తినడం కంటే మీ కోసం, మీ పిల్లల కోసం ఇంట్లో తయారు చేసిన ఆహారాన్ని ప్యాక్ చేయండి. డబ్బు సేవింగ్‌తోపాటు ఆరోగ్యానికి కూడా హాని ఉండదు.

పాత వస్తువులను వదిలించుకోండి

చాలామంది ఇళ్లల్లో అవసరం లేని వస్తువులు ఉంటాయి. వాటిని స్టోర్ రూమ్‌లో వేసి చేతులు దులుపుకుంటారు. కానీ అలాంటి అనవసరపు వస్తువులు ఇంట్లో ఉంటే అమ్మేయడం మంచిది. ఎందుకంటే అవసరం లేని వస్తువులు ఇంట్లో ఉంటే ఇళ్లు ఇరుకుగా అనిపిస్తుంది. ఎటు చూసినా వస్తువులే కనిపించడంవల్ల మనసుకు కూడా చికాకుగా ఉంటుంది. కాబట్టి అలాంటి వస్తువులను వెంటనే అమ్మేయాలి. ఈ రోజుల్లో ఇంటర్నెట్‌లో వస్తువులను విక్రయించడం గతంలో కంటే సులభం. ఏదైనా పాత వస్తువు ప్లేస్‌లో కొత్తది కొనాలనుకున్నప్పుడు.. పాతదాన్ని రీప్లేస్ చేసుకుంటే డబ్బు ఆదా అవుతోంది.

బాటిల్ వాటర్

మరో ముఖ్యమైన విషయం బాటిల్ వాటర్. ఈ విషయంలో చాలామంది అనుకోకుండానే ఎక్కువ మొత్తం ఖర్చు చేస్తారు. రోజుకు రూ.20 మాత్రమే కదా అని నీళ్లు కొనుక్కొస్తుంటారు. కానీ నెలకు లెక్క చూస్తే పెద్ద మొత్తమే ఖర్చవుతుంది. అలా కాకుండా ట్యాప్ వాటర్ తాగితే మనీ సేవ్ అవుతుంది. ఒకవేళ టాప్ వాటర్ తాగేందుకు మీరు ఇష్టపడనట్లయితే మీ వంటగదిలో వాటర్ ఫిల్టర్ పెట్టించుకోండి. ఇది కాస్త పెద్ద పెట్టుబడే అయినప్పటికీ.. రోజూ బాటిల్ వాటర్ కొనుగోలుతో పోల్చుకుంటే దీర్ఘకాలికంగా పొదుపే అవుతుంది.

రిచార్జ్ ప్లాన్స్


ఈ రోజుల్లో చాలామంది బడ్జెట్‌కు మించిన ప్లాన్‌ని ఎంచుకుంటారు. మీరు మీ ఫోన్‌ను ఎలా ఉపయోగిస్తున్నారో బాగా పరిశీలించండి. మీ అవసరాలకు అనుగుణంగా ఉత్తమమైన ప్లాన్‌లను ఉపయోగించుకోండి. ఎందుకంటే ఎక్కువ డేటాను ఉపయోగించనప్పటికీ రిచార్జ్ ప్లాన్ మాత్రం భారీగా చేసుకుంటారు. అలాగే ఇంట్లో ఉండే టీవీ రిచార్జ్ ప్లానింగ్‌లోనూ అలాంటి తప్పులే చేస్తే సరిదిద్దుకోండి. టీవీ ప్లాన్‌లో మీకు ఉన్న అన్ని ఛానెల్‌లు నిజంగా అవసరమా అనేది కూడా ఆలోచించండి. అలా మీరు చూసే చానెల్స్‌కు మాత్రమే రిచార్జ్ చేయించుకుంటే ఖర్చు కొంతైనా తగ్గుతుంది.

ఐపీఎల్‌కు గుడ్ బై చెప్పిన ధోనీ.. ఇది కూడా కూల్‌గా చెప్పేశాడు!

ఐపీఎల్ నుంచి ఆటగాడిగా తప్పుకున్న ఎంఎస్ ధోనీ
సీఎస్‌కే మెంటార్‌గా సరికొత్త బాధ్యతలు
రిలీజ్ లిస్టులో తన పేరు చేర్చండంటూ ధోనీ వ్యాఖ్య
ధోనీ లేని సీఎస్‌కేను ఊహించలేమన్న శ్రీనివాసన్
ఐదు ఐపీఎల్ ట్రోఫీలు అందించిన రికార్డు కెప్టెన్



క్రికెట్ ప్రపంచంలో ఒక అద్భుత శకం ముగిసింది. భారత మాజీ సారథి, చెన్నై సూపర్ కింగ్స్ దిగ్గజ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)కు వీడ్కోలు పలికాడు. ఆటగాడిగా మైదానాన్ని వీడినప్పటికీ, సీఎస్‌కేతో అతడి అనుబంధం కొనసాగనుంది. ఐపీఎల్ 2027 సీజన్ నుంచి ధోనీ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు 'టీమ్ మెంటార్'గా సరికొత్త బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. ధోనీ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ఎలా తెలియజేశాడో సీఎస్‌కే యజమాని రూపా గురునాథ్ ఒక ప్రత్యేక వీడియో ద్వారా పంచుకున్నారు. వచ్చే సీజన్ కోసం ఆటగాళ్ల విడుదల (రిలీజెస్), వ్యూహాలపై శనివారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ పరిణామం చోటుచేసుకుంది. సీఎస్‌కే ఎండీ కాశీ విశ్వనాథన్ విడుదల చేయాల్సిన ఆటగాళ్ల జాబితాను చదువుతుండగా, ధోనీ చాలా నిశ్శబ్దంగా స్పందిస్తూ.. "బహుశా ఆ జాబితాలో నా పేరు కూడా చేరిస్తే మంచిదేమో" అని అన్నాడని రూపా గురునాథ్ వెల్లడించారు. ఆ మాట విన్న వెంటనే తామంతా తీవ్ర భావోద్వేగానికి గురయ్యామని, జట్టుకు 200 శాతం న్యాయం చేయలేనప్పుడు మైదానంలో కొనసాగడం ధోనీ నైజం కాదని ఆమె పేర్కొన్నారు. ఇకపై ధోనీ మెరుపు స్టంపింగ్స్, హెలికాప్టర్ షాట్లు మైదానంలో కనిపించవనే నిజాన్ని జీర్ణించుకోవడం కష్టంగా ఉందని, అయితే కొత్త తరం ఆటగాళ్లకు మార్గదర్శనం చేసేందుకు మెంటార్‌గా ఆయన రాకను స్వాగతిస్తున్నామని చెప్పారు. సీఎస్‌కే అధినేత ఎన్ శ్రీనివాసన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ధోనీ గొప్పతనాన్ని కొనియాడారు. "ధోనీ లేని సీఎస్‌కేను ఊహించలేము. దాదాపు రెండు దశాబ్దాలుగా మేము కలిసి ఎదిగాం. 2008 ఐపీఎల్ వేలంలో ధోనీని కెప్టెన్‌గా ఎంపిక చేయడమే మా జీవితంలో తీసుకున్న అత్యుత్తమ నిర్ణయం. ట్రోఫీల కోసం మాత్రమే కాదు, అతడి వ్యక్తిత్వం పరంగా చూసినా ఆ నిర్ణయం చాలా గొప్పది. చెన్నై సూపర్ కింగ్స్ ఎప్పటికీ అతడి సొంత ఇల్లే" అని శ్రీనివాసన్ స్పష్టం చేశారు. సీఎస్‌కే మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్ సైతం ధోనీ సేవలను గుర్తు చేసుకున్నారు. చెన్నై నగరంతో, అభిమానులతో ధోనీ విడదీయరాని బంధాన్ని ఏర్పరచుకున్నాడని తెలిపారు. ట్రోఫీలు గెలవడమే కాకుండా, వాటిని గెలిచిన విధానమే ధోనీ వారసత్వాన్ని ఉన్నతంగా నిలబెట్టిందని, మెంటార్‌గా అతడు ఇచ్చే సలహాలు భవిష్యత్ తరానికి ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకడైన ధోనీ, సీఎస్‌కేను ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలబెట్టడంతో పాటు రెండు ఛాంపియన్స్ లీగ్ టీ20 టైటిళ్లను అందించాడు. చెన్నై తరపున అత్యధికంగా 272 మ్యాచ్‌లు ఆడిన ధోనీ, 5,314 పరుగులతో జట్టులో రెండో అత్యధిక స్కోరర్‌గా నిలిచాడు. ఉత్కంఠ సమయాల్లో ప్రశాంతంగా మ్యాచ్‌లను ముగించడం, అనూహ్య ఫీల్డింగ్ మార్పులతో ఫలితాలను మార్చేయడం అతడి ప్రత్యేకత. ఇప్పుడు ఆటగాడి పాత్ర నుంచి గురువు పాత్రలోకి అడుగుపెడుతున్న ధోనీ సరికొత్త ఇన్నింగ్స్‌ను చూసేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



అశ్విన్ విశ్లేషణ అక్షరాలా నిజమైంది.. ధోనీ రిటైర్మెంట్‌పై మాజీ స్పిన్నర్ ఊహించినట్లే జరిగింది!

క్రికెట్ మైదానంలో వ్యూహాలను ముందుగానే పసిగట్టడంలో రవిచంద్రన్ అశ్విన్‌కు తిరుగులేదు. పిచ్‌పై బంతి ఎలా తిరుగుతుందో లెక్కలేసే ఈ స్పిన్ మాంత్రికుడు, చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) అంతర్గత ఆలోచనలను కూడా అంతే కచ్చితంగా అంచనా వేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఆటగాడిగా మహేంద్ర సింగ్ ధోనీ తప్పుకోవడం జట్టుకు మంచిదని అశ్విన్ విశ్లేషించిన కొద్దిసేపటికే, ధోనీ ఆటగాడిగా రిటైర్మెంట్ ప్రకటన వెలువడడం క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది. ఐపీఎల్ 2027 రిటెన్షన్ గడువు ముగుస్తున్న కీలక సమయంలో తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా అశ్విన్ ఒక ఆసక్తికర చర్చను లేవనెత్తాడు. ఒకవేళ ధోనీ వచ్చే సీజన్ ఆడకూడదని భావిస్తే, అతడిని ప్లేయర్‌గా రిలీజ్ చేసి మెంటార్ లేదా కోచ్ బాధ్యతలు అప్పగించాలని సూచించాడు.

స్పోర్ట్స్

కెప్టెన్‌గా హెన్రిచ్ క్లాసెన్.. ప్రకటన విడుదల



సౌతాఫ్రికా పవర్ హిట్టర్ హెన్రిచ్ క్లాసెన్ మరో టీ20 లీగ్‌లో భాగం కానున్నాడు. ఈ ఏడాది అతడు ఇంటర్నేషనల్ లీగ్ టీ20లో అడుగుపెడుతున్నాడు. ఈ క్రమంలో వేలానికి ముందుగానే గల్ఫ్ జెయింట్స్ క్లాసెన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఝూ20 సీజన్ 2026లో తమ జట్టుకు హెన్రిచ్ క్లాసెప్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని మంగళవారం గల్ఫ్ జెయింట్స్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. కాగా ఈ లీగ్‌లో క్లాసెన్ సారథిగా అరంగేట్రం చేయడం పట్ల అభిమానులు ఖుషీ అవుతున్నారు. కాగా ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ పవర్ హిట్టర్‌గా క్లాసెన్ దూసుకుపోతున్నాడు. వివిధ లీగ్‌లలో తన బ్యాటింగ్ నైపుణ్యాలతో విధ్వంసకర ఆటగాడిగా పేరు తెచ్చుకున్న.. క్లాసెన్‌కు కెప్టెన్‌గా మాత్రం చెత్త రికార్డు ఉంది.

చెత్త రికార్డు.. అయినా

అమెరికా వేదికగా మేజర్ క్రికెట్ లీగ్‌లో 2024, 2025 సీజన్లలో సీటెల్ ఓర్కాస్ కెప్టెన్‌గా క్లాసెన్ పనిచేశాడు. అతడి సారథ్యంలో ఈ రెండు ఎడిషన్లలో సీటెల్ జట్టు పన్నెండు మ్యాచ్‌లు ఆడి పదకొండు ఓడిపోయి.. ఒకే ఒక్క మ్యాచ్ గెలిచింది. గతేడాది పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది. ఈ క్రమంలో జట్టు వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ.. 2025 సీజన్ మధ్యలోనే క్లాసెన్ కెప్టెన్ పదవికి రాజీనామా చేశాడు. బ్యాటింగ్‌పై దృష్టి పెట్టే క్రమంలో అతడు ఈ నిర్ణయం తీసుకోగా.. జింబాబ్వే దిగ్గజం సికందర్ రజా జట్టును ముందుకు నడిపించాడు.

క్లాసెన్‌పై నమ్మకం

కెప్టెన్‌గా క్లాసెన్‌కు మంచి రికార్డు లేకపోయినప్పటికీ గల్ఫ్ జెయింట్స్‌పై అతడిపై నమ్మకంతో సారథ్య బాధ్యతలు అప్పగించడం విశేషం. పవర్ హిట్టర్‌గా అతడి బ్యాటింగ్ నైపుణ్యాలు జట్టుకు కొత్త ఊపిరిలూదడం ఖాయం. కాగా ఇప్పటి వరకు టీ20 ఫార్మాట్లో ఈ సౌతాఫ్రికా స్టార్ మొత్తంగా 6900 పరుగులు పూర్తి చేసుకున్నాడు. ఇక నవంబరు 21- డిసెంబరు 20 మధ్య ఝూ20- 2026 టోర్నీకి షెడ్యూల్ ఖరారైంది. డీజెర్ట్ వైపర్స్, ఎంఐ ఎమిరేట్స్, షార్జా వారియర్స్, గల్ఫ్ జెయింట్స్, దుబాయ్ క్యాపిటల్స్, అబుదాబి నైట్ రైడర్స్ టైటిల్ కోసం బరిలో నిలిచాయి.

చాలా ఇష్టంతో బిజిలీగా చేశా - రుహానీ శర్మ

ఆకాశంలో ఒక తార సినిమా కథకు తాను పర్సనల్ గా బాగా కనెక్ట్ అయ్యానని చెప్పారు హీరోయిన్ రుహానీ శర్మ. ఈ చిత్రంలో ఆమె బిజిలీ అనే పాత్రలో నటిస్తున్నారు. దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని లైట్‌బాక్స్ మీడియా ఆధ్వర్యంలో సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మించగా, స్వప్న సినిమా, గీతా ఆర్ట్స్ సమర్పిస్తున్నారు. ఈ నెల 20 ఆకాశంలో ఒకతార సినిమా రిలీజ్ కు రాబోతోంది. రీసెంట్ గా జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్ లో రుహానీ శర్మ స్పీచ్ స్పెషల్ అట్రాక్షన్ గా మారింది. హీరోయిన్ రుహానీ శర్మ మాట్లాడుతూ – ఆకాశంలో ఒక తార సినిమా కథకు నేను పర్సనల్ గా బాగా కనెక్ట్ అయ్యాను. ఈ కథలో అమ్మాయిలాగే నేను కూడా హిమాచల్ ప్రదేశ్ లోని ఒక ఊరి నుంచి వచ్చాను. నేను హీరోయిన్ గా మారి ఇలాంటి వేదిక మీద నిలబడి మాట్లాడతానని ఎవరైనా అప్పుడు చెప్పి ఉంటే నమ్మేదాన్ని కాదు. పరిస్థితుల కారణంగా మన కలల్ని చిన్నవి చేసుకోకూడదు. ఈ చిత్రంలో బిజిలీ అనే పాత్రలో నటిస్తున్నాను. ఈ క్యారెక్టర్ ను చాలా ఇష్టపడి చేశాను. క్యారెక్టర్ నిడివి ఎంత ఉంది అనేకంటే ఆ పాత్ర కథలో ఎంత కీలకంగా ఉందనేది చూసుకుంటాను. అందుకే ఈ రోల్ చేశాను. మీరంతా మా మూవీని, నా పర్ ఫార్మెన్స్ ను ఇష్టపడతారని నమ్ముతున్నాను'అన్నారు.

సినీ ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్.. రమ్యకృష్ణ ఆసక్తికర వ్యాఖ్యలు



చిత్రపరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ ఉందనే చర్చ ఎప్పటి నుంచో నడుస్తోంది. దీనిపై కొంతమంది తారలు బహిరంగంగా స్పందించారు కూడా. కొంతమంది తమకు అలాంటి పరిస్థితులు ఎదురుకాలేదని చెప్తే..మరికొంతమంది మాత్రం క్యాస్టింగ్ కౌచ్ ఉందని చెబుతూ..తమకు ఎదురైన చేదు అనుభవాలను పంచుకున్నారు. తాజాగా దీనిపై సీనియర్ నటి రమ్యకృష్ణ కూడా స్పందించింది. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. 'క్యాస్టింగ్ కౌచ్ అనేది అప్పుడూ ఉంది. ఇప్పుడూ కొనసాగుతుంది. భవిష్యత్తులోనూ కొనసాగుతుంది. ఈ విషయంలో నో చెప్పడానికి వీల్లేదు. దానికి ఓకే చెప్పాలా? నో చెప్పాలా? అనేది నీ చేతుల్లో ఉంది. బలవంతంగా, తప్పనిసరి పరిస్థితుల్లోనో లేదంటే ఇష్టపూర్వకంగానే ఇది జరగొచ్చు. మా ప్రొఫెషన్ గ్లామర్ ప్రపంచం చుట్టూ తిరుగుతుంటుంది.. ప్రజలు మా గురించి ఎక్కువగా మాట్లాడుకుంటారు. కానీ బయట చాలా చోట్ల జరుగుతోంది. అన్ని డిపార్ట్‌మెంట్స్‌లోనూ, అన్ని రంగాల్లోనూ ఇది ఉంది. ప్రస్తుతం ఆడ, మగ తేడా లేకుండా జరుగుతోంది' అని రమ్యకృష్ణ చెప్పుకొచ్చింది. రమ్యకృష్ణ సినీ కెరీర్ విషయానికొస్తే..80, 90 దశకాలలో దక్షిణాదిలో అగ్రనటిగా వెలుగొందారు. చిరంజీవి, నాగార్జున,వెంకటేష్, రజినీకాంత్ ఇలా ఎంతో మంది స్టార్ హీరోలతో కలిసి పని చేశారు. గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధన్యమున్న రోల్స్‌తో అలరించారు. 40 ఏళ్ల కెరీర్‌లో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషలలో వందలాది చిత్రాల్లో నటించారు. పెళ్లి తర్వాత కూడా నటిగా కొనసాగారు. ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా బిజీ అయిపోయారు.

ఓటీటీలోకి ప్రశాంత్ నీల్ హారర్ థ్రిల్లర్ '418'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే!



సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పణలో, టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై తెరకెక్కిన సరికొత్త భయానక హారర్ థ్రిల్లర్ చిత్రం '418'. కీర్తన్ నాదగౌడ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా అక్టోబర్ 23న థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను భయాందోళనకు గురిచేసింది. బిగ్ స్క్రీన్ పై ఈ సరికొత్త అనుభూతిని మిస్ అయిన హారర్ మూవీ ప్రియుల కోసం ప్రముఖ డిజిటల్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్ గుడ్ న్యూస్ చెప్పింది. థియేట్రికల్ రన్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే ఓటీటీలోకి అడుగుపెట్టడానికి సిద్ధమైంది. నవంబర్ 19 నుంచి ఈ హారర్ థ్రిల్లర్ నెట్‌ఫ్లిక్స్‌లో అధికారికంగా స్ట్రీమింగ్ కానుంది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో పాన్-ఇండియా లెవెల్‌లో ఐదు ప్రధాన భాషల్లో ఈ చిత్రం డిజిటల్ ప్రేక్షకులను అలరించనుంది. చైత్ర జె ఆచార్, సూర్య రాజ్, చరణ్ లక్కరాజు తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి వెంకీ జీజీ సంగీతం అందించగా, ప్రశాంత్ నీల్ ప్రెజెన్స్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. కథ విషయానికి వస్తే.. సిటీకి దూరంగా ఉండే ఓ మెడికల్ కాలేజీ హాస్టల్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఏళ్ల తరబడి మూసి ఉన్న ఆ హాస్టల్‌ను తిరిగి తెరిచినా, అందులోని '418' నంబర్ గది మాత్రం అలాగే లాక్ చేయబడి ఉంటుంది. ఆ గది చుట్టూ అల్లుకున్న అతీంద్రియ శక్తులు, భయానక వాతావరణం, వివేక్ అనే విద్యార్థికి ఎదురయ్యే ఊహించని షాకింగ్ పరిణామాలు ప్రేక్షకులను సీట్లో కూర్చోనివ్వకుండా భయపెడతాయి. థియేటర్లలో ప్రేక్షకులను వణికించిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలో ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.

వన్ మోర్ ఛాన్స్.. కాల్పుల ఘటన తర్వాత రీఎంట్రీ ఇచ్చిన టైగర్ ష్రాఫ్!



ముంబైలోని జుహులో తన కారుపై జరిగిన కాల్పుల ఘటన నుంచి తృటిలో తప్పించుకున్న బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ ఎట్టకేలకు సోషల్ మీడియాలోకి రీఎంట్రీ ఇచ్చారు. నుష్రత్ భరూచాతో కలిసి నటిస్తున్న తన కొత్త మ్యూజిక్ సింగిల్ టీజర్‌ను ఆయన అభిమానులతో పంచుకున్నారు. అయితే, ఈ పోస్ట్‌కు ఆయన పెట్టిన "వన్ మోర్ ఛాన్స్, వన్ మోర్ డాన్స్" అనే క్యాప్షన్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. అక్టోబర్ 18న జరిగిన కాల్పుల ఘటన తర్వాత, ఆయన చేసిన ఈ పోస్ట్ జీవితంపై మరో అవకాశం అనే అర్థాన్ని ఇస్తోందంటూ నెటిజన్లు చర్చించుకుంటున్నారు. గత నెల అక్టోబర్ 18న సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఫుట్‌బాల్ ప్రాక్టీస్ ముగించుకుని కారులో వస్తున్న టైగర్ ష్రాఫ్ లక్ష్యంగా దుండగులు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో టైగర్ ప్రాణాలతో బయటపడినప్పటికీ, ఆయన డ్రైవర్ మరియు ఒక వ్యక్తి గాయపడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అత్యంత ప్రతిష్టాత్మకంగా దర్యాప్తు చేపట్టి, నవంబర్ 15 నాటికి సుమారు 14 మంది నిందితులను అరెస్ట్ చేశారు. ఈ తీవ్రమైన ఘటన తర్వాత సోషల్ మీడియాకు దూరంగా ఉన్న టైగర్ ష్రాఫ్, ఇప్పుడు తన కొత్త ప్రాజెక్ట్‌తో తిరిగి రావడంతో పాటు ప్రాణాపాయం నుంచి బయటపడిన తర్వాత చేసిన ఈ పోస్ట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది

విజయ్ దేవరకొండ రణబాలికి ఓటీటీలో అద్భుతమైన స్పందన

నెట్‌ఫ్లిక్స్‌లో ట్రెండింగ్!

విజయ్ దేవరకొండ హీరోగా, రష్మిక మందన్న హీరోయిన్‌గా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' ఇటీవల నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా విడుదలై సంచలన విజయాన్ని నమోదు చేస్తోంది. థియేటర్ల తర్వాత డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లో అడుగుపెట్టిన ఈ చిత్రానికి ఊహించని విధంగా భారీ స్పందన లభిస్తోంది. ముఖ్యంగా హిందీ ప్రేక్షకులతో పాటు వివిధ భాషల ప్రేక్షకులు ఈ సినిమాపై తీవ్ర ఆసక్తి చూపుతున్నారు. ఈ చిత్రంలో చూపించిన చారిత్రక సంఘటనలు, బ్రిటిష్ కాలం నాటి పరిస్థితులు ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్దఎత్తున చర్చకు దారితీశాయి. కొంతమంది బ్రిటన్ నెటిజన్లు సినిమాలో చూపించిన బ్రిటిష్ పాలన విధానాలపై స్పందిస్తుండగా, మరికొందరు వలసవాద పాలనలో భారతీయులు పడిన నష్టాలు మరియు జరిగిన దారుణాలను గుర్తుచేస్తూ పోస్టులు పెడుతున్నారు. మరోవైపు, ఈ సినిమాలో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నల నటనకు ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. వీరిద్దరి ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ, పవర్‌ఫార్మెన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయని, జాతీయ స్థాయిలో గుర్తింపు లభించేలా అద్భుతంగా నటించారని నెటిజన్లు కొనియాడుతున్నారు. దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ టేకింగ్, చరిత్రను నిజాయితీగా తెరకెక్కించిన విధానంపై కూడా ప్రశంసల జల్లు కురుస్తోంది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రానికి అజయ్-అతుల్ సంగీతం అందించగా, టి-సిరీస్ సమర్పించింది. మొత్తానికి ఓటీటీలో వస్తున్న రెస్పాన్స్‌తో 'రణబాలి' సినిమా సరికొత్త రికార్డుల దిశగా దూసుకుపోతోంది.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999